ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 12 | ఆగష్టు 2021

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి.పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో....

అద్భుతమైనది కృష్ణావతారం ........................................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................. 4


అక్షరమణమాల - ద్విపద 6 ....................................... 26

భగవద్గీత - శ్లోకం 2-50 ......................................... 27

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



నీ దేహం ఎక్కడ ఉన్నా
గురువుతోటి, ఈశ్వరుడి తోటి,
మానసికఅనుబంధం పెట్టుకో.
గురువుతోటి,
పరమేశ్వరుడితోటి
మానసికఅనుబంధం
పెట్టుకొంటే, నది ఏ విధంగా సముద్రంలో కలిసిపోతుందో
అలాగ నీ మనస్సు వెళ్లి చైతన్యంలో ఐక్యమవుతుంది.



# అద్భుతమైనది కృష్ణావతారం!

భగవంతుడు జీవకోటికి ఈ సృష్టికి ఆధారం. ఆధారముగా ఉన్న వస్తువు ఒకటే, అదే పరబ్రహ్మము, ఆ పరబ్రహ్మమే కాళ్ళు చేతులు తొడుక్కొని వచ్చింది, అది కృష్ణావతారం. వాడే నారాయణుడు.

ఈశ్వరుడి యొక్క అవతారాలలో రెండు అవతారాలు చాలా ముఖ్యమైనవి. ఒకటి కృష్ణావతారం, రెండు లింగోద్భవం, శివావతారం. శివరాత్రి రోజున ఈశ్వరుడు లింగరూపం ధరించాడు , ఇది ఫిబ్రవరి మార్చిలలో వస్తుంది. ఆగష్టు సెప్టెంబరు నెలలలో శ్రీకృష్ణ జన్మోత్సవం, జన్మాష్టమి వస్తుంది,

ఉత్తర భారతదేశంలో, గుజరాత్ లో, మధుర గోకులంలో, గౌడీయ మఠము వారు, కృష్ణ భక్తులు ఎక్కడ ఉన్నా ఈరోజున అతి వైభవముగా జన్మాష్టమి జరుపుతారు. ఆయన అనుకుంటే దేవుడు కాదు, అనుకుంటే అవ్వలేదు స్వయంగా భగవంతుడు, సంపూర్ణమైన అవతారం అని కృష్ణుడు గురించి కృష్ణావతారం గురించి చెపుతారు.

కృష్ణుడి యొక్క నిర్యాణం అయిన వెంటనే, అంటే కృష్ణుడు శరీరం చాలించిన వెంటనే, ఆ మరుసటిరోజు నుంచే కలియుగం ప్రారంభమయ్యింది. కలియుగం ప్రారంభమయ్యి ఇప్పటికీ 5000 సంవత్సరాలు పూర్తి అవుతోంది. కృష్ణుడు శరీరం విడిచిపెట్టటం కలి ప్రవేశించటం ఇదంతా ఒకేసారి జరిగింది.

కృష్ణుడు ముఖ్యంగా అనేక లీలలు చూపించాడు. అద్భుతమైనటువంటి అవతారం, సమగ్రమైన అవతారం. అన్ని కోణాలు వికసించినటువంటి అవతారం. స్వయంగా భగవంతుడు. భాగవతం చదివితే కృష్ణుడు యొక్క జీవితం, కృష్ణుడి యొక్క లీలలు, ఆయన

చేసిన చేష్టలు అద్భుతాలు మహిమలు ఇవన్నీ భాగవతంలో కనిపిస్తాయి. కృష్ణుడి యొక్క జననం గురించి వేదవ్యాసుడు దశమ స్కందంలో వివరించాడు. భాగవతంలో ప్రహ్లాదుడు, ధృవుడు వంటి అనేక మంది భక్తుల కథలు ఉన్నాయి. అందుచేత బాగుపడే వాళ్ళు అందరూ భాగవతం అధ్యయనం చేయండి అని పెద్దలు చెపుతారు.

కృష్ణ స్వామి ఒక లీడరుగా, ఒక దేవతాపురుషుడిగా, పొలిటీషియన్‌గా, స్పీకర్‌గా అనేక కోణాలలో దర్శనమిస్తాడు. కృష్ణుడు చెప్పిన ప్రసంగాలు ఇంటిదగ్గర ఒకరు రాసిస్తే చదివిన ప్రసంగాలు కాదు. ఆయన స్వయంగా, భగవద్గీతని, భారత యుద్ద సమయంలో, కురుక్షేత్రంలో యుద్ధం ప్రారంభించే ముందు భగవద్గీతని ప్రవచనం చేశారు. యుద్ధం యొక్క ప్రారంభంలో చాలా టెన్షన్ ఉంటుంది. కానీ యుద్ధభూమిలో యుద్ధం ప్రారంభం అయ్యే టైములో ఒక గొప్ప శాస్త్రాన్ని, ఒక గ్రంథరాజాన్ని, మహోన్నతమైన, శాశ్వతంగా ఉండే గ్రంథాన్ని ఆయన అర్జునుడికి ఉపదేశించారు. అది భగవంతుడి ముఖంలోనుంచి వచ్చింది కాబట్టే, భగవంతుడి చేత గానం చేయబడింది కాబట్టే, దానికి భగవద్గీత అని పేరు వచ్చింది.

యుద్ధం మధ్యలో అర్జునుడికి మోహం రావటం, ఆ మోహం లోనుంచి అర్జునుడిని విడుదల చేయటం కోసం ఈ గీతా శాస్త్రాన్ని అంతా కూడా, అర్జునుడిని నిమిత్తమాత్రంగా పెట్టుకొని చెప్పారు. మొత్తం జీవకోటికి అంతా కూడా తత్త్వజ్ఞానం కలగటం కోసం, ఆత్మజ్ఞానం కలగటం కోసం మోక్షానుభవం పొందటం కోసం, మనమందరం తరించటం కోసం అనేక ఉపాయాలు మనకి భగవద్గీతలో ప్రవచనం చేశారు కృష్ణ స్వామి.

ఆయన లీలలు కావాలంటే భాగవతం చదవాలి, ఆయన చెప్పిన సందేశం వినాలంటే భగవద్గీత అధ్యయనం చెయ్యాలి. భగవద్గీత మొత్తం సుమారు 700 శ్లోకాలు. కృష్ణుడి చేత బోధించబడింది, దానిని వేదవ్యాసుడు శ్లోకబద్ధం చేసాడు. చెప్పిన వాడు కృష్ణుడు, విన్నవాడు కృష్ణుడు, రాసినవాడు కృష్ణుడు. ఎందుకంటే భగవద్గీతలో విభూతియోగంలో పాండవులలో అర్జునుడుని నేను అన్నాడు, మునులలో వేదవ్యాసుడిని నేను అన్నాడు. అంటే విన్నవాడూ ఆయనే, చెప్పినవాడూ ఆయనే, రాసినవాడూ ఆయనే. వ్యాసుడిని నేను, అర్జునుడిని నేను అని చెప్పాడు. అన్నీ ఆయనే. ఆయన కానిదంటూ ఏమీ లేదు. ఎవ్రీథింగ్ ఈజ్ కృష్ణాస్ లీలా - గాడ్స్ లీలా! ఈలోకంలో జరిగే ప్రతి సంఘటన కూడా ఈశ్వరుని లీల, కృష్ణుడి లీల. అందుచేత ఈశ్వరుని అవతారాలలో అత్యంత ముఖ్యమైనటువంటి అవతారం కృష్ణావతారం.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 25 మార్చి 1984, వడ్లవానిపాలెం


ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనలో దుర్గుణాలు కనుక ఉంటే అవి జ్ఞానానికి దూరం చేస్తాయి. అంటే ఆరోజుకారోజు అజ్ఞానం అనే అడుసులో కూరుకుపోతాము. ఇప్పుడు మనం జీవించే జీవితాలు అన్నీ పొడుగు జీవితాలు. రాత్రుళ్ళు స్వప్నాలు వస్తాయి కదండీ మనకి, అవి పొట్టి జీవితాలు. అవి కురస, ఇవి పొడుగు. అంతే! అంతకుమించి ఏమీ తేడా లేదు. మన శరీరం పంచభూతాలతో తయారయ్యింది. దీనిని స్థూలశరీరం అన్నారు. లోపల మనస్సు అని ఒకటి ఉంది. దానిని సూక్ష్మశరీరం అంటారు. అది కూడా శరీరమే. మనం ఈ శరీరం తోటి చేసే పనుల విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి. ఈ శరీరం తోటి మనం మంచి చేసినా, చెడ్డ చేసినా, కామక్రోధాలతోటి ఉన్నా, రాగ ద్వేషాల తోటి ఉన్నా ఈ శరీరం తోటి చేసే పనుల వల్ల ఆ శరీరం తయారు అవుతుంది. అందుకే దీనిని స్థూలశరీరం అన్నారు, దానిని సూక్ష్మశరీరం అన్నారు. మనస్సును కూడా శరీరం అన్నారు. ఎందుచేత శరీరం అన్నారు అంటే ఈ శరీరం తోటి చేసే పనులు బట్టే అది తయారు అవుతుంది. అయితే మనకి స్థూలశరీరం నాశనం అవుతూ ఉంటుంది. ఈ స్థూలశరీరం ఎంత అబద్ధమో, సూక్ష్మశరీరం కూడా అంతే అబద్ధం.

భగవద్గీతలో భగవంతుడు ఏమని చెప్పాడు? నువ్వు పూర్వం అనేక జన్మలు ఎత్తావు. నీలాగే నేను కూడా పూర్వం అనేక జన్మలు ఎత్తాను. భవిషత్తులో అనేక జన్మలు ఎత్తబోతున్నావు. నేను అంతే! నీకు నాకు తేడా ఏమిటి అంటే నీ జన్మలు అన్నీ నాకు తెలుసు. నువ్వు ఏ జన్మ లోంచి ఇక్కడకు వచ్చావో నీకు తెలియదు. అంతే తేడా! అని చెప్పిన భగవంతుడే మరొకచోట ఉన్నది ఒక్కటే నిజం, అది ఆత్మ. అది సత్యం. దానికి జన్మ లేదు, మరణం లేదు. అది శాశ్వతమైన వస్తువు. దానిని అనుభవంలోనికి తెచ్చుకున్నవాడే జ్ఞాని అవుతాడు అన్నాడు. రెండూ భగవంతుడే చెప్పాడు. ఏది నిజం ఇందులో? రెండు నిజాలు ఉంటాయా ఎక్కడైనా? నిజం ఎప్పుడూఒక్కటిగా ఉంటుంది కాని రెండు నిజాలు ఉంటాయా? అంటే వ్యావహారిక దశలో మనం ఈ జన్మలో ఎలా ఉన్నామో, మరొక జన్మలో కూడా ఇలాగే ఉండి ఉండవచ్చు. అంటే ఈ దేహంలో చేసిన పనులే సూక్ష్మదేహం కింద తయారు అవుతుంది. అయితే ఇదీ నిజం కాదు, అదీ నిజం కాదు. సూక్ష్మదేహం కూడా నిజం కాదు. మన ఎద్దులు చూడండి

పని చేసినంత కాలం పని చేస్తాయి తరువాత ముసలివి అయిపోతాయి. ఈ దేహాలు కూడా అంతే పని చేసినంత కాలం పనిచేస్తాయి. తరువాత దేహంఏమైపోతుంది? పడిపోతుంది. కాని శరీరం తోటి చేసిన పనుల యొక్క ప్రభావం వల్ల సూక్ష్మశరీరంగా తయారు అవుతుంది, ఈ స్థూలశరీరం లోంచే సూక్ష్మశరీరం తయారు అవుతుంది. దీనినే మనస్సు అని అంటారు. మనకి స్వప్నాలు వస్తూ ఉంటాయి చూడండి. మనం వర్లవాని పాలెంలోనే ఉంటాం కానీ ఎక్కడికో వెళ్లినట్టు, ఎక్కడికో తిరిగినట్టు స్వప్నాలు వస్తూ ఉంటాయి. ఈ శరీరం మంచం మీదే ఉంటుంది. లోపల ఉన్న శరీరం ఉంది చూశారు అది ఇంకొక శరీరం తొడుక్కుని తిరుగుతూ ఉంటుంది. ఈ శరీరాన్ని తీసుకు వెళ్లదు. మనకు స్వప్నాలు వస్తున్నప్పుడు ఇంకొక కొత్త దేహాన్ని తొడుక్కుని ఈ మనస్సు ఆ దేహం తోటి అన్నీ తిరిగి వస్తూ ఉంటుంది. ఇదంతా వాసన బట్టే. నిన్న సాయంత్రం సూర్యనారాయణ రాజుగారు ఒక ప్రశ్న అడిగారు, ఏవండి కొంతమందికి అధికారం మీద చాలా వ్యామోహం ఉంటుంది. కొంతమందికి ధనమందు విపరీతమైన వ్యామోహం ఉంటుంది. కొంతమందికి కీర్తి యందు చాలా వ్యామోహం ఉంటుంది. ఎందుచేత అంటారు? కీర్తితోటి ఏమి చేసుకుంటారు? అవసరాలకి మించిన ధనం ఉంటుంది, ఏమి చేసుకుంటారు? అధికారం ఏమి చేసుకుంటారు? అని అడుగుతున్నారు.

అది యదార్థం కాదు, మనకు కీర్తి యందు కాంక్ష ఉంది అనుకోండి, ఆ కీర్తికి నిజంగా ప్రాణం లేదు. మన వాసన దానికొక ప్రాణం ఇచ్చి, దానికోసం జీవిస్తుంది. యదార్థం చెప్పాలంటే మనకు ధనంతో ఏమీ పనిలేదు. ఉన్నది ఒక్కటే పని, అది ఆత్మను దర్శించటమే పని. దానితో సమానమైన పని కాని, దానికి మించిన పని కాని అసలు లేనే లేదు. ఈ జాగ్రదావస్థని, స్వప్నావస్థని, సుషుప్తావస్థని దాటి ఉన్నది ఆత్మ ఒక్కటే! ఆత్మలోనే ఈ మూడు అవస్థలు జరుగుతున్నాయి. మీరు ఆత్మను విడిచి పెట్టి ఎంత గొప్ప కార్యం సాధించినప్పటికీ, ఎంత గొప్ప పని సాధించినప్పటికీ అది స్వప్నం తోటి సమానం. మీకు స్వప్నంలో గొప్ప గొప్ప



**మీకు సత్య సాక్షాత్కారం కావాలంటే....**

**మీరు లోకంలో ఏ వృత్తిలో ఉన్నా....**

**అహంవృత్తిలో మాత్రం ఉండకండి అనేవారు భగవాన్.**

పనులు చేసినట్టు వస్తూ ఉంటాయి. అవి ఎంత వరకు నిజం? చాలా గొప్ప కార్యం చేశాం. గొప్ప పని పూర్తి చేశాం అనుకుంటారు. మెలకువ వచ్చిన తరువాత ఇదంతా అబద్ధం అనిపిస్తుంది. అలా మీకు జ్ఞానం కలిగేవరకు, ఆత్మను దర్శించే వరకు జీవితంలో ఏదో సాధించాము, ఏదో సాధించాము అనుకుంటాం. కాని అది ఏదీ నిజం కాదు.

సోదరమహాశయులారా! నేను కఠిన సత్యాలు చెప్పవలసి ఉంటుంది. నామరూపాల తోటి కనిపిస్తున్న ప్రపంచం ఎంతకాలం అయితే మనకు నిజంగా కనిపిస్తుందో అంతకాలం కూడా ఎన్ని సాధనలు చేసినప్పటికీ, మనకు తెలియకుండా మనల్ని మభ్య పెట్టి, మనల్ని మరపించి, మనసు ఏదో ఒకరకంగా బయటికి వచ్చేస్తూ ఉంటుంది లోకంలోకి. ఈ లోకం నిజంగా కనిపిస్తున్నంత కాలం మీ మనసుని ఆపు చేయలేరు? జపం చేస్తారు, నామం చేస్తారు, ఐదు నిమిషలు చేస్తారు, పది నిముషాలు చేస్తారు. సత్యం ఎక్కడ ఉందో తెలియనప్పుడు మీకు నామరూపాలు వచ్చేస్తూ ఉంటాయి. నామరూపాత్మకమైన బుద్ధికలుగుతూ ఉంటుంది సహజంగా. కానీనామరూపాత్మకమైనబుద్ధి అంతా కూడా నిజం కాదు. పుట్టుక తోటే ప్రతీ మనిషి కొన్ని గుణాలతో పుడతాడు. సూర్యనారాయణరాజు గారు అడిగిన ప్రశ్నకి సమాధానం చెబుతాను. ప్రతివాడు ఏదో వాసనతోటి పుడతాడు. ఆ వాసన చుట్టాలు అనుకుంటాడు. మన ఇంటికి చుట్టాలు వచ్చారు అనుకోండి. మనం ఆ చుట్టాలని చాలా మర్యాద చేస్తాం అనుకోండి, వాళ్ళు అలాగే ఉంటారు. అలాగే మనం ఏమి చేస్తున్నాం, నామాలు చేస్తున్నాం, జపాలు చేస్తున్నాం, సాధనలు చేస్తున్నాం, యాత్రలు తిరుగుతున్నాం, కానీ మనలో ఉన్న వాసనలను మటుకు చుట్టాలు కింద చూస్తున్నాం. ఇంక అవి ఎలా పోతాయి? ఇక మీ అజ్ఞానం ఎలా పోతుంది? అజ్ఞానం పోవటం అనే సమస్యే లేదు. మనం వాటిని అతిధులు అనుకుంటున్నాం. నిజంగా భగవంతుడు మన బంధువు కాదు. మన వాసనలే మన బంధువులు. అందుచేత మనం ఇలా అజ్ఞానం అనే ప్రవాహంలో కొట్టుకు పోతున్నాం. ఇలా శరీరాలు పుడతాయి. శరీరాలు ముసలివి అవుతాయి. శరీరాలు పడిపోతాయి. మళ్ళీ కొత్త శరీరాలు అలా వస్తు ఉంటాయి. లోపలున్న వాసనలని బంధువులు వలే చాలా ఆప్యాయంగా, వాటిని ప్రేమించుకుంటూ వాటి కోసమే జీవిస్తూ ఉంటాం.

నేను చెప్పే మాటలు ఎంత బాగున్నాయి అనిపిస్తుంది కొంతమందికి, కొంతమందికి ఏమీ నచ్చలేదు మాకుఅనిపిస్తుంది, రెండూ అబద్ధమే! నేను చెప్పేది అబద్ధం అయినప్పటికీ మీ సంస్కారానికి అనుగుణంగా ఉంటే ఎంత బాగుందో అనిపిస్తుంది. నేను చెప్పింది

నిజం అయినప్పటికీ మీ సంస్కారానికి అనుగుణంగా లేకపోతే ఏమీబాగోలేదు అనిపిస్తుంది. మన మనసులో ఉన్న సంస్కారాలను, వాసనలను, తలంపులను, ఊహలని మూట కట్టి ఒక పక్కన పెట్టి మనం శాస్త్రం వినాలి కాని మన వాసనలతో శాస్త్రం వింటే, అందులో ఏముందో మన బుర్రలోకి వెళ్లదు. హృదయంలోకి వెళ్లదు. మన తలంపులు అన్నీ మూట కట్టి ఒక పక్కకు పెట్టవలసిందే!ఎదుటివాడు ఎన్ని చెప్పినప్పటికీ, శాస్త్రం చెప్పినప్పటికీ, భగవంతుడు చెప్పినప్పటికీ, ఆ మాటలను నిర్మలమైన మనసు తోటి, పరిశుద్ధమైన హృదయంతోటి ఆ మాటలువినాలి. ప్రతీ మనిషి కూడా పుట్టినప్పుడు కొన్ని సంస్కారాల తోటి పుడతాడు. ఆ సంస్కారాల కోసమే జీవిస్తాడు. ఆ సంస్కారాల కోసమే డబ్బు ఖర్చు పెట్టుకుంటాడు. కాలం ఖర్చు పెట్టుకుంటాడు. జీవితం అంతా వృధా చేసుకుంటాడు. ఆ సంస్కారాలనే స్మరిస్తూ మరణిస్తాడు.

భగవద్గీతలో ఒక మాట చెప్పాడు. మరణించేటప్పుడు నన్ను స్మరించే వారికి మోక్షాన్ని ఇస్తాను అని భగవంతుడు చెప్పాడు. జీవితం పొడవునా ఎవడైతే భగవంతుడిని స్మరిస్తున్నాడో, వాడు మరణించే టైములో భగవంతుడిని స్మరించగలడు కాని, జీవితం పొడవునా అలవాటు లేనివాడు ఎవడూ మరణించే టైములో భగవంతుడిని స్మరించలేడు. ఎవరో పక్కన ముసలమ్మలు కూర్చొని రామా రామా అని అనిపించినా, వాడు రామా, రామా అన్నా, వాడి హృదయానికి ఏమీ సంబంధం ఉండదు. పెదాలు కదులుతాయి అంతే! ఈ సూక్ష్మశరీరం వాసనల యొక్క మయం. అవి ఎలా వస్తున్నాయి? ఎలా ప్రారంభమవుతున్నాయి లోపల? మన శరీరాల తోటి చేసే చేష్టల వల్ల, మన ఇంద్రియాల తోటి చేసే చేష్టల వల్ల ఆ సూక్ష్మశరీరం తయారు అవుతుంది. మనం దేనికోసం జీవిస్తున్నాం అంటే నిజం కోసం జీవించటం లేదు, ఆత్మ కోసం జీవించటం లేదు, మన వాసనలని సంతృప్తి పరచుకోవటం కోసం జీవిస్తున్నాం. ప్రతీ మనిషి పుట్టినప్పుడే శత్రువులు తోటి పుడతాడు వాడు. వాడికి రాగం ఉంటుంది, ద్వేషం ఉంటుంది. అవి రెండు వాడికి శత్రువులే. ఆ శత్రువులను స్నేహితులు అనుకుని అభివృద్ధి చేసుకుంటాడు. అభివృద్ధి చేసుకుని తాను పుట్టినప్పుడుకంటే మరణించే టైముకు రాగ ద్వేషాలని పెంచుకొని మరణిస్తాడు. అంటే ఆరోజుకారోజు అజ్ఞాని అయిపోతాడు. వాసన ఆ జన్మకాజన్మ అభివృద్ధి చెందుతుంది. ఇక్కడ ఆచార్యులు వారు చెప్పేది ఏమిటి అంటే లోభిత్వం చాలా చెడ్డ గుణం. ఇందులో చిన్న రహస్యం ఉంది. మీరు ఎదుటివారిని విమర్శించటం మానేయండి. ఎందుచేతంటే కోపం ఎక్కువ ఉన్న మనిషి లోభిత్వం ఉన్న మనిషిని చూసి ఆక్షేపిస్తాడు. ఎక్కువ లోభిత్వం ఉన్న మనిషి ఎక్కువ కోపం ఉన్న మనిషిని

చూసి ఆక్షేపిస్తాడు. రెండూ నష్టమే! తనలో ఉన్న బలహీనత గురించి వాడు పట్టించుకోడు. ఎదుటివాడిలో ఉన్న బలహీనతని పెద్దది చేసి చూపిస్తాడు. ఇది మానవునిలో ఉన్న స్వభావం. దాంట్లో వీడికి కలిసి వచ్చేది ఏమిటి? అందుచేత ఈ బలహీనతలు అన్నీ కూడా జన్మతః వస్తున్నాయి. ఎవడి బలహీనతలు వాడు జాగ్రత్తగా పరిశీలించి చూసుకుని వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి.

అయితే, ప్రతీవాడికీ సుఖం కావాలి. ప్రతీ వాడికీ శాంతి కావాలి. కాని ఎవడూ సుఖాన్ని అనుభవించటం లేదు, ఎవడూ శాంతి అనుభవించటం లేదు. పూర్వం కంటే ఇప్పడు భోగ వస్తువులు అన్నీ పెరిగిపోయినవి. పూర్వం కార్లు లేవు, రైళ్ళు లేవు, విమానాలు లేవు, ఇప్పుడు కార్లు వచ్చాయి, రైళ్ళువచ్చాయి, విమానాలు వచ్చాయి. మన ఇంద్రియభోగాలకి అనుకూలమైన comforts అన్నీ వచ్చాయి. పూర్వం కంటే ఇప్పుడు అన్నీ పెరిగినవి. కానీ మీకు ఎక్కడ ఏ దేశంలోనూ శాంతి కనపడదు, సుఖం కనపడదు. ప్రతీ మనిషి భోగాన్ని కోరుకుంటాడు. ఎందుచేత భోగాన్ని కోరుకుంటున్నాడు? భోగంలో సుఖం ఉంది అని వాడు అనుకుంటాడు కాబట్టి భోగమే కోరుకుంటాడు. భోగం కోరుకోని మనిషినిఎవరినైన చూశారా మీరు స్త్రీ కాని, పురుషుడు కాని, ప్రతివాడూ భోగాన్నే కోరుకుంటాడు. డబ్బు కూడా ఎందుకు సంపాదించాలి? డబ్బు ఉంటేనే కాని భోగం రాదు. డబ్బు లేనివాడు భోగాన్ని ఎలా అనుభవిస్తాడు? అనుభవించలేడు. భోగం అనుభవించాలి అంటే డబ్బు సంపాదించాలి. అందుచేత భోగం అనుభవించేటప్పుడు భోగం అనుభవించటం ద్వారా మనం సుఖాన్ని పొందుతాము అని వీడు అనుకుంటాడు. కానీ భోగం అనుభవించాక వాడికి దుఃఖం పెరుగుతుంది కానీ సుఖం పెరగదు. దుఃఖం పెరుగుతుంది. అశాంతి పెరుగుతుంది. దేనివల్ల? భోగం వల్ల. కాని ప్రతీ జీవుడు భోగం అనుభవిస్తాడు. భోగం కావాలి అని కోరుకుంటాడు. కాని భోగం వాడిని బంధిస్తుంది అన్న సంగతి ఏ అజ్ఞానికి తెలియదు. అజ్ఞానాన్ని తెంచుకుని ఆ తాడు తెంచుకుని బయట పడ్డవాడికి అది తెలుస్తుంది అంతవరకు భోగం వల్లే నాకు శాంతి కలుగుతుంది, భోగం వల్లే నాకు సుఖం కలుగుతుంది, భోగం వల్లే శాశ్వతమైన సుఖాన్ని పొందచ్చు అనుకుంటాడు కాని, భోగం యొక్క గర్భంలో దుఃఖం ఉందని, భోగం యొక్క గర్భంలో నరకం ఉందని, భోగం అనేక జన్మలని నరకంలో పెడుతుంది అని, నీచాతి నీచమైన జన్మలకి భోగం తరుముకువెళుతుంది అన్న సంగతి వీడికి తెలియదు.

ఈ రాగద్వేషాలు, కామక్రోధాలు ఇవన్నీ జీవలక్షణాలు. జీవలక్షణాలు ఉన్నంతసేపు మనిషికి జ్ఞానం కలగటానికి అవకాశం లేదు. సాధన అంటే ఏమి లేదు. మనలోని జీవ లక్షణాలను పోగొట్టుకోవటమే సాధన. మన హృదయంలో భగవంతుడు ఉన్నాడు. మనకి బయట కనిపిస్తున్నది అంతా అబద్దమే. మన హృదయంలో భగవంతుడు ఆత్మ రూపంలో ప్రకాశిస్తున్నాడు అది ఒక్కటే నిజం. మీరు ఈ జన్మలో కాకపోయినా కోటి జన్మలు ఎత్తిన తర్వాత కూడా ఇక్కడకు రావలసిందే! ఈ గేటు దగ్గరకు రావలసిందే. ఉన్నది ఒక్కటే నిజం. అది హృదయంలో ఆత్మ రూపంలో ప్రకాశిస్తుంది. ఇది ఎంతకాలం అయితే మనకి తెలియదో మీరు ఏ గుళ్ళోకి వెళ్ళినా, ఏ గోపురం చుట్టూ తిరిగినా, ఏ నదిలో స్నానం చేసినా ఈ సత్యం దగ్గరకి మీరు వచ్చే వరకు, ఈ సత్యంలో మీ మనసు అణిగిపోయే వరకు మనం మాయా చక్రం నుండి బయటకు రాలేము. మాయ అనే తాచుపాము మనలని కరిచింది, ఆ విషాన్ని బయటకి తీసుకోవటం కోసం, బయటకి పిండుకోవటం కోసం, మనం సాధనలు చేస్తున్నాము. మీరు బాగా ప్రశాంతంగా ఆలోచించండి. అందరి హృదయాలలోనూ ఆత్మ రూపంలో ప్రకాశిస్తున్నాను అని భగవంతుడు చెప్పాడు కదా! ఆత్మ ఇక్కడ ఉంది కదా ఇక మీరు సాధించేది ఏమిటి అసలు? నేను అనే దానిని విడిచిపెట్టండి, మీకు వెంటనే సత్యం దర్శనం అవుతుంది. ఒకొక్కసారి నాకు అనిపిస్తుంది. మనలో ఆత్మను తెలుసుకోవడానికి ఎంతో ధైర్యం కావాలి అని ఉపనిషత్తులలో కూడా చెప్పారు. కాని నా వ్యక్తిగత అభిప్రాయం నాకు అనిపిస్తుంది. నన్ను నేను తెలుసుకోవడానికి నాకు ధైర్యం ఎందుకు?

నిన్ను నువ్వు తెలుసుకోవడానికి ఎంతో ధైర్యం ఉంటేనే గాని తెలుసుకోలేవు అని గీతలో, ఉపనిషత్తులో చెప్పాడు కానీ నాకు ఏమనిపిస్తుంది అంటే నన్ను నేను తెలుసుకోవడానికి నాకు ధైర్యంతోటి పని ఏముంది అనిపిస్తుంది. మీకు ఏదైనా మాటలు చెప్పాలి అంటే మనస్సులో నాకు ధైర్యం కావాలి, నన్ను నేను తెలుసుకోవడానికి నాకు ధైర్యం

**మీ అహంభావన కోసం, మీ మనస్సుని సంతృప్తి పరుచుకోవటానికి మీరు జీవించవద్దు, నాకోసం జీవించండి, అప్పుడు నా దయకి మీరు పాత్రులు అవుతారు. జ్ఞానానికి వారసులు అవుతారు, మోక్షాన్ని పొందుతారు అని పరమాత్మ గీతలో చెప్పాడు.**



ఎందుకు? ఎందుచేత మన హృదయంలో ఉన్న ఆత్మను మనం గుర్తించలేకపోతున్నాం? అది స్వయంగా ప్రకాశిస్తోంది కదా! ఇది ఒక్కటే నిజం కదా, అయితే ఎందుచేత దీనిని గుర్తించలేక పోతున్నాం అంటే మన సంస్కారాలు, ఈ రాగ ద్వేషాలే అడ్డు వస్తున్నాయి. ఈ రాగ ద్వేషాలని బయటకితొలగించుకోవటం కోసమే సాధనలు, పూజలు, జపాలు. ఈనాటికైనా, ఏనాటికైనా మీ మనస్సు అనాత్మవైపు ప్రయాణిస్తున్నంత కాలం, అనాత్మ గురించి ఆలోచిస్తున్నంత కాలం, ఈ మాయ అనే చక్రం నుండి బయటపడే అవకాశాలు లేవు. మనస్సు కూడా ప్రకృతే, అది దేని గురించి ఆలోచిస్తుంది? ప్రకృతి గురించి ఆలోచిస్తుంది. నీ మనస్సే నీకు శత్రువు. నీ మనస్సే నీకు మిత్రుడు అని భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. అంటే అర్థం ఏమిటి? నా మనసు గనుక శుద్ధ మనసు అయితే అది ఆత్మవైపు నాకు దారి చూపిస్తుంది. నా మనసు గనుక అశుద్ధ మనసు అయితే ప్రకృతిలోకి లాక్కెళ్లిపోతుంది. ఈ వడ్లవానిపాలెంలో నాలుగు వేలమంది జనం ఉన్నారు అనుకోండి. ఈ నాలుగు వేలమంది జనం నాకు వ్యతిరేకంగా ఉన్నారు అనుకోండి నాలుగు వేలే కాదు నలభై వేలమంది వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, నా జ్ఞానానికి ఇది అడ్డు రాదు. అయితే నాకు జ్ఞానం కలగకుండా, నా హృదయంలో ఆత్మగా ప్రకాశిస్తున్న భగవంతుడిని తెలుసుకోకుండా ఎవరైనా అడ్డు వస్తున్నారా నాకు? ఈ వడ్లవానిపాలెం అడ్డు వస్తోందా? ఈ ప్రజలు అడ్డు వస్తున్నారా? కాదు. నా మనస్సు, నా ఇంద్రియాలు అడ్డు వస్తున్నాయి.

నా అహంకారం అడ్డు వస్తుంది. బయట ప్రజలు ఎవరూ అడ్డు రావటం లేదు. నా ఇంద్రియాలు నిర్మలంగా ఉండాలి. నా మనస్సు నిర్మలంగా ఉండాలి. నా మనస్సు నిదానంగా ఉండాలి. ముందు మనస్సులో కుదురు రావాలి. అప్పుడు మీరు ఆత్మవైపు ప్రయాణం చేస్తారు. చిన్న రహస్యం చెపుతాను. మీరు మనస్సులో పెట్టుకోండి. ఇంటికెళ్లాక ఇదే మంత్రం అనుకుని మననం చెయ్యండి. ఇప్పుడు నేను చెప్పేదే మంత్రం. మీరు సంసారం అంటే మీ ఇంటికాడ ఉన్న మీ భర్త, మీ పిల్లలు, మీ అత్తగారు, మీ మామగారు సంసారం అనుకుంటారు. అది అబద్ధం. ఏదోకరోజు మీ శరీరం పడిపోతుంది కదా, అయితే మీ సంసారం పోతుందా? మీకు అలా పుస్తకాలలో చెప్పినా అది నిజం కాదు. సంసారం అంటే మనం స్వార్థం తోటి చేసే ప్రతీపని సంసారం. మనం స్వార్థం తోటి చేసే ప్రతీపని కూడా సంసారానికి తీసుకువెళ్తుంది. అదే సంసారం! మనం ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకున్నా స్వార్థం గురించే ఆలోచిస్తున్నాము. స్వార్థం గురించి నా శరీరాన్ని ఖర్చు పెడుతున్నాను. నా ఇంద్రియాలని ఖర్చు పెడుతున్నాను. ఇదే సంసారం! నేను ఎంతకాలం

అయితే స్వార్థం అనే సుడిగుండంలోంచి బయటపడలేనో, అంతకాలం సంసారాలు నా కూడానే వస్తాయి. కామ్యకర్మ అంతా సంసారమే. అంటే కోరికతోటి చేసే ప్రతీ పని కూడా సంసారమే. మనం కోరికతోటి చేస్తున్నామా లేదా? కోరిక తోటే చేస్తున్నాం. అది సంసారమే! భగవంతుడు ఏమని చెప్పాడు అంటే నిష్కామకర్మ చెయ్యమని చెప్పాడు. ఎందుచేత నిష్కామకర్మ చెయ్యమని చెప్పాడు? మనం నిష్కామకర్మ చేస్తే భగవంతుడికి ఏమైనా కలిసి వస్తుందా? ఆయనకేమి కలిసి రాదు. మనం ఈ సంసారంలోంచి బయటపడతాము. కామ్యకర్మ చేసేవాడు సంసారంలో కూరుకుపోతాడు. నిష్కామకర్మ చేసేవాడు సంసార చక్రం నుండి బయటకు వచ్చేస్తాడు.

సోదరమహాశయులారా! మీరు పువ్వులతో దేవుడిని ఆరాధిస్తున్నారు. పళ్ళతోటి ఆరాధిస్తున్నారు, నోటితోటి నామాన్ని చేస్తున్నారు కానీ ప్రవర్తన ద్వారా ఎంతమంది ఆరాధిస్తున్నారు భగవంతుడిని? మీ ప్రవర్తన ద్వారా మీరు భగవంతుడిని ఆరాధించాలి. మంచి పువ్వులు దేవుడి దగ్గర పెట్టాలి అనుకున్నప్పుడు, మన ప్రవర్తన మంచి ప్రవర్తన అయి ఉండాలి. మంచి ప్రవర్తన ద్వారా ఎవడైతే ఈశ్వరుడిని ఆరాధిస్తున్నాడో వాడే జ్ఞాని. పువ్వులు, అరటిపళ్ళు దేవుడికి ఇస్తున్నారు అనుకోండి, ఈ అరటిపళ్ళు దేవుడికికావాలా? ఈ పువ్వులు కావాలా? ఈ పువ్వులు ఇవ్వగా, ఇవ్వగా, ఈ అరటిపళ్ళు ఇవ్వగా, ఇవ్వగా, మన అహంకారం కూడా ఇవ్వటం నేర్చుకుంటాం. అందుకే పువ్వులు, అరటిపళ్ళు భగవంతుడికి సమర్పించమని చెప్పారు. భగవాన్ అనేవారు అట, నామీదగుళ్ళో ఉన్న దేవుడు ఎంతో అదృష్టవంతుడు. గుళ్ళో ఉన్న దేవుడికి పళ్ళు పట్టుకెళ్ళి తినమని అడగటం లేదు. కాని నా దగ్గరకి పళ్ళు తీసుకొచ్చి నన్ను తినమని అంటున్నారు. అందుకే నాకంటే గుళ్ళో ఉన్న దేవుడే ఎంతో అదృష్టవంతుడు. నాకు పళ్ళు పెడుతున్నారు. నాకు కూడా చూపించి పట్టుకుపోతే బాగుండును. నన్ను తినమంటున్నారు తెచ్చిన పళ్ళు అన్నీ. అందుచేత నాకంటే ఆయన పనే సుఖంగా ఉంది.

ఒక గడ్డిఎంటు (తాడు) ఉంది అనుకోండి, ఆ తాడులో ఒక్కొక్క గడ్డిపరకను లాగేస్తే ఇంక ఆ తాడు ఏమీ ఉండదు. మనలో ఉన్న వాసనలు, కోరికలు కలిపి మూట కింద మనసును ఆక్రమించాయి. ఒకొక్క వాసనని, ఒకొక్క కోరికని బయటకు లాగేస్తే, ఇంక అక్కడ మనసుఅంటూ ఏదీ లేదు. ఇవి మనం కల్పించుకున్నవే కానీ నూటికి నూరు పాళ్ళు అబద్ధం. ఈ శవానికి (దేహం) ఎంతో పూజ చేస్తాం మనం, ఈ శవాన్ని ఆరాధిస్తాం,

ఈ శవానికి మనం ఖర్చు పెట్టె కాలంలో కనీసం వందవ వంతు శివుడు కోసం ఖర్చు పెడితే చాలు. మనం దేని గురించి ఆలోచిస్తున్నప్పటికి, స్వార్ధమే కేంద్రంగా పెట్టుకొని మనిషి పనిచేస్తున్నంత కాలం వాడి కూడా సంసారం వస్తుంది. మీరు అనుకున్నది మటుకు సంసారం కాదు. మనం స్వార్థంతో చేసే పనులే సంసారం. ఆత్మకి పుట్టుకే లేదు మరి మీరు ఎవరు? మనమెవరో మనకి తెలియటం లేదు. దానిని తెలుసుకోవడం కోసం ఈ మాటలు కూడా ఎంతోకొంత సహాయం చేస్తాయి. నా హృదయంలో ఉన్న శాంతి నాకు దొరికినప్పడు ఇంక బయట సుఖాల తోటి, బయట శాంతి తోటి నాకు పనిలేదు. ఇప్పుడు బయట సుఖాల కోసం తిరుగుతున్నాను. నా హృదయంలో ఉన్న శాంతి తెలియటం లేదు కాబట్టి బయట శాంతి కోసం తిరుగుతున్నాను. నిజమైన సుఖం, నిజమైన శాంతి, నిజమైన ఆనందం నా హృదయంలోనే ఉంది. అది నాకు అందినప్పడు ఇంక ప్రకృతితో నాకు పనేముంది? మీరు చాలా పనులు చేసుకుంటున్నారు కదా, డబ్బు కూడా సంపాదిస్తున్నారు కదా, ఎన్నో పనులు చేస్తున్నారు కదా, కీర్తిని కూడా సంపాదించుకుంటున్నారు కదా, జీవితం అంటే చాలామంది రూపాయలు సంపాదించుకోవడం, కొంచెం కీర్తిని సంపాదించుకోవడం, నలుగురిలో గౌరవంగా తిరగడం ఇదే జీవితం అనుకుంటున్నారు. ఇది చాలా దురదృష్టం. గౌరవం ఏంటి? ఎవరికి గౌరవం? అహంకారానికా? నీకు వచ్చిన గౌరవం ఎంతసేపు నిలబడుతుంది? నేనంటే మీకు ఇష్టం లేదు అనుకోండి, ఇష్టం లేదు అని చెప్పండి. నా జీవితం మీకు నచ్చలేదు అనుకోండి నచ్చలేదు అని చెప్పండి. నా మాటలు నచ్చలేదు అనుకోండి నా మాటలు నచ్చలేదు అని చెప్పండి. కానీ నా అనుభవాన్ని మాత్రం మీరు ఎవరూ కాదు అనలేరు. నా మనసు కూడా పడిపోవచ్చు, నా అనుభవం ఎక్కడకి వెళుతుంది? నా అనుభవాన్ని ఎవరూ దొంగతనం చెయ్యగలరు?

మనం అందరం వడ్లవానిపాలెంలోకూర్చున్నాం. అసలు వడ్లవానిపాలెం అనే ఊరే లేదని మీరు అందరూ చెబితే నాకు ఎలా అనిపిస్తుందో, ఆత్మ లేదు అని మీలో ఎవరైనా చెప్పినా నాకు అలాగే అనిపిస్తుంది. మనలోపల నిజంగా ప్రకాశిస్తున్న ఆత్మే నిజమైన అరుణాచలం. ఒకటి త్యాగం, రెండు భక్తి, మూడు ధ్యానం. భక్తి విడిచిపెట్టకూడదు. ధ్యానం విడిచిపెట్టకూడదు. మనం త్యాగాలు చేస్తున్నాం? ఏమి త్యాగాలు చేస్తున్నారు? మీకు వేరుగా ఉన్న వస్తువును మీరు త్యాగం చేయచ్చు. కాని మీరు అనుకున్న వాసన ఒక్క వాసనని ఎవరైనా విడిచిపెట్టగలరా? అలా విడిచిపెడితే అది త్యాగం. మీకంటే వేరుగా ఉన్న ఒక వస్త్రాన్నో, మీకంటే వేరుగా ఉన్న ధనాన్నో, మీకంటే వేరుగా ఉన్న ఒక స్థలాన్నో మీరు

త్యాగం చేయవచ్చు. కాని మీది అనుకున్నటువంటి ఒక వాసనని ఎవరైనా విడిచి పెట్టగలరా? ఎవరైనా ఒక వాసనను త్యాగం చెయ్యండి. మీరు ఎన్నిసార్లు అయినా గీత చదవచ్చు కానీ త్యాగికాని వాడికి గీత అర్థం కాదు అని చెప్పారు. ఈ సెకనులో, ఈ గంట నుంచి మీరు ఎవరైనా ప్రయత్నం చెయ్యండి. మీకు ఇష్టమైన సంస్కారం కాని, ఇష్టమైన వాసన గాని ఒక వాసనని త్యాగం చేయండి.

ఆచార్యుల వారు ఏమని చెప్పారు అంటే భగవంతుడి యొక్క రూపాన్ని నిరంతరం స్మరించాలి, సజ్జనసాంగత్యం చెయ్యాలి, విష్ణు సహస్రనామాలు, భగవద్గీత పారాయణ చెయ్యమన్నారు. మీకున్న దాంట్లో, మీకు కలిగిన దాంట్లో తోటి మానవుడికి సహాయం చెయ్యమన్నారు. మీకు ఇష్టదైవాలు ఉన్నారు కదా రాముడో, కృష్ణుడో, శివుడో ఎవరో ఒక ఇష్ట దైవం ఉన్నారు కదా! వాళ్ళు అంటే నిజంగా హృదయపూర్వకంగా మీ మనస్సులో ఇష్టం ఉంటే మీకు, మీ మనస్సు ఎందుకు కదిలిపోతుంది అక్కడ నుంచి? ప్రీతి ఉన్నప్పుడు మీ మనస్సు అసలు ఆ దేవుడు దగ్గర నుంచి ఎందుకు కదులుతుంది? మీ ఇష్ట దైవాన్ని కూడా మీ మనస్సు నమ్మినట్టుగా నటిస్తుంది కాని అది నిజం కాదు. భగవంతుడి మీద నిజంగా మనకు విశ్వాసం ఉంటే మన జీవితం ఆయన కోసం ఎందుకు జీవించడం లేదు? మనం స్వార్థం కోసం జీవిస్తున్నామా? సంసారం కోసం జీవిస్తున్నామా? భగవంతుడు కోసం జీవిస్తున్నామా? మనకు విపరీతంగా గాలి వేస్తుంటే విసినకర్ర తోటి పనిలేదు, ఫ్యాను తోటి పనిలేదు. అలాగే సత్పురుషుల తోటి సహవాసం చేస్తే అసలు మీ సాధనతోటి పనిలేదు. మీరు ఎవడి దగ్గర కూర్చుంటే శాంతి వస్తుందో వాడే నిజమైన మహాత్ముడు. ఎవడి దగ్గర కూర్చుంటే మీ మనస్సుని, ఇంద్రియాలని, మీ శరీరాన్ని కూడా మర్చిపోతారో వాడే మహాత్ముడు.

సజ్జన సహవాసం చెయ్యటం కోసం అవసరం అయితే ప్రపంచం యొక్క అంచుల దాకా వెళ్ళాలి. ఎవరి అహంకారం తోటి వాళ్ళు మనమే తెలివైన వాళ్ళంఅనుకుంటున్నాం. అందుకే స్వామి వివేకానంద చెప్పినట్టు మనమందరం నూతిలో కప్పలం. నూతిలో కప్పలు

**మన ప్రాణశక్తిని భగవంతుడిని తెలుసుకోవటానికి ఉపయోగించుకోవాలి కానీ, అనవసర విషయాలకి, చిల్లర విషయాలకి, ఇహానికి పరానికి పనికిరాని విషయాలకి ప్రాణశక్తిని వృధా చేయకూడదు.**



ఆ నుయ్యే ప్రపంచం అనుకుంటాయి అట. కోరికలు అందరూ కోరుకుంటున్నారు కానీ భగవంతుడు నేను ఆత్మ రూపంలో ప్రకాశిస్తున్నాను అనిచెబుతుంటే ఆత్మ కావాలి అని కోరుకునేవాడు ఎవడైనా ఉన్నాడా? ఆత్మను దర్శించాలి అనే కోరిక తప్పించి మిగతా అన్ని కోరికలు కోరుకుంటున్నారు. ఇది మాయ కాదా? మీరు అబద్ధాన్ని కోరుకుంటున్నారు, నిజాన్ని కోరుకోవటం లేదు ఇదే మాయ. ఒకటి మనసులో ఉంచుకోండి. జ్ఞానికి మూడు లోకాల్లో ఆధిపత్యం ఇస్తే, మూడు లోకాలకి అతనిని చక్రవర్తి కింద చేస్తే ఈ మూడు లోకాలు కూడా జ్ఞానికి గడ్డిపరక కింద కనిపిస్తాయి. వాడు జ్ఞాని. సజ్జన సాంగత్యం చెయ్యండి. సజ్జన సాంగత్యం వలన మంచి గుణాలు ఏర్పడతాయి. మనస్సు, హృదయం సంస్కరింప బడుతుంది, మీకు మోక్షం వస్తుంది. సజ్జన సాంగత్యం విడిచి పెట్టకండి. దుర్జనుల తోటి స్నేహం చెయ్యటం కంటే పులి నోట్లో పడటం మంచిది అని మధ్వాచార్యుల వారు చెప్పారు. దుర్జనులు ఎవరైనా స్నేహం చెయ్యమని మనల్ని తరుముకు వస్తున్నారు అనుకోండి ఎదురుగుండా పులి వస్తోంది అనుకోండి, మనం వెనక్కి వెళ్ళాలా? ముందరకి వెళ్ళాలా? మధ్వాచార్యులు వారు చెప్పింది ఏమిటి అంటే నువ్వు వెనక్కి తిరిగి దుష్టుల సహవాసం చెయ్యటం కంటే, ముందరకి వెళ్ళి పులి నోట్లో పడమన్నారు. ఎందుచేత? పులి నోట్లో పడితే ఆ శరీరమే పోతుంది. పీడ వదిలిపోతుంది. కానీ దుష్టుల యొక్క సహవాసం చేస్తే వందలాది జన్మలు నీచ జన్మలు వస్తాయి.

సర్వ సాధారణంగా మనుషుల్లో ఉన్న బలహీనత ఏమిటి అంటే నేను మీకు ఇష్టమైనది చెబితే నన్ను మెచ్చుకుంటారు మీరు, మీకు ఇష్టం లేనిది చెబితే నన్ను మెచ్చుకోరు మీరు. అది మానవుడి యొక్క బలహీనత. మీకు ఏది మంచో ఆ మాట చెబితే మీరు నన్ను మెచ్చుకోలేరు. మీకు సంతోషం కలుగజేసే మాట, మీ స్వార్థాన్ని పెంచే మాట నేను చెబితే నన్ను చూసి మీరు ఇష్టపడతారు. ఇంతమంది ఇక్కడ కూర్చున్నారు. మీరు అందరూ చాలా తెలివైన వారు, చాలా మేధావులు అంటే మీరు సంతోషిస్తారు. కానీ మిమ్మల్ని ఎవరైనా తెలివి తక్కువ వారు అంటే మీరు ఎవరైనా ఊరుకుంటారా? ఊరుకోరు. బయట మర్యాద కోసం నటించినా లోపల ఎంతో బాధ కలుగుతుంది. ఆకలి బాధ భరించగలరు కాని ఎదుటివాళ్ళుచిన్నమాట అన్నా భరించలేరు. నాకు ఎంతో తెలివి ఉంది అనుకున్నవాళ్ళు కూడా తెలివి తక్కువ వాళ్ళే. సత్యం కోసం ఎవడైతే ప్రయత్నం చేస్తాడో, వాడు ఒక్కడే తెలివి గలవాడు. వాడు ఒక్కడే వివేకవంతుడు. నిజం కాని దానికోసం తన జీవితం ఖర్చు పెట్టేవాడు ప్రతీవాడు తెలివి తక్కువ వాడే. ఆత్మ కానిదాన్ని సాధించటం కోసం ఎవడు ఏ

ప్రయత్నం చేసినప్పటికీ వాళ్ళు అందరూ కూడా కంప్లీట్ గా వివేకంలేనివాళ్ళే. తెలివి తక్కువ వాళ్ళు కిందే లెక్క!

మనం నిజమైన వస్తువు కోసం ప్రయత్నం చేస్తున్నామా? అబద్ధమైన వస్తువు కోసం ప్రయత్నం చేస్తున్నామా? భగవంతుడి మీద మన భారం ఎందుకు వెయ్యలేకపోతున్నాం? ఎంతో కొంత భక్తి ఉంది కదా, పది పైసలు భక్తో, ఇరవై పైసలు భక్తో, ఎంతో కొంత భక్తి ఉంది కదా మన దగ్గర. భగవంతుడి మీద మనం భారం ఎందుకు వెయ్యలేకపోతున్నాం? ఎంత భారం అయినా భగవంతుడు మోయగలడు. కాని భగవంతుడు మీద భారం వెయ్యడం మానేసి మనం దుఃఖ పడుతున్నాం. ప్రశాంతంగా ఉండటం నేర్చుకోండి. ఆత్మని, అనాత్మని వేరు చేయటం నేర్చుకుంటే, ఈ దేహంలో ఉండగానే మీరు జ్ఞానులు అవుతారు. ఈ మాటలు మీరు ఎందుకు పట్టుకోలేక పోతున్నారు? నేను చెప్పిన మాటలు ఉన్నది ఉన్నట్టుగా తీసుకుని మీ స్వంత బుద్ధి తోటి, మీ స్వతంత్రమైన ఆలోచన తోటి, మీరు సొంతంగా ఎంతమంది ఆలోచించగలుగుతున్నారు? ప్రతి సెకను నా మనసు తోటి నేను కలిసిపోతున్నాను. నా శరీరం తోటి నేను కలిసిపోతున్నాను. ఇవి రెండు నేను కాదు. ఇంక నేను ఏమిటి సాధించేది? మీ ఇంట్లో సమస్య అయినా సరే చెప్పుడు మాటలు నమ్మకుండా సొంత బుద్ధితో ప్రశాంతంగా కూర్చొని ఆలోచించడం నేర్చుకుంటున్నారా? ఆచార్యుల వారు చెప్పేది ఏమిటంటే మీరు డబ్బును ఎలా కాపాడుకుంటున్నారో, మీ శీలాన్ని మీరు ఎలా కాపాడుకుంటున్నారో, మీ సొంత బుద్ధిని కూడా కాపాడుకోమని చెబుతున్నారు. చాలామంది మిగతా ఇంద్రియాలకి పని చెబుతారు కాని మెదడుకి పనే చెప్పరు. కాళ్ళకి పని చెబుతారు, చేతులకి పని చెబుతారు, నోటికి ఇంక అస్తమాను పనే. అన్ని ఇంద్రియాలకి పని చెబుతారు కాని అసలు మెదడుకి పనే చెప్పరు. అసలు మెదడు ఉందని కూడా కొంతమందికి గుర్తే లేదు. మెదడు కూడా ఒకటి ఉంది, దీనితోటి మనం ఆలోచించాలి. అనే విషయం కూడా మనుష్యులు చాలామంది మర్చిపోయారు. మానవుడిలో ఉన్న బలహీనత ఏమిటి అంటే అనుకరణ. అనుకరణ ఎందుకు వస్తుంది అంటే సొంత బుద్ధి లేనప్పుడు అనుకరణ వస్తుంది.

ఎవరైనా ఏదైనా ఒక వస్తువు తింటున్నప్పుడు మీరు చూశారు అనుకోండి మీకు కూడా తినాలని ఉంటుంది. అది మీకు పడుతుందో, పడదో, అది ఆరోగ్యమో, అనారోగ్యమో, అది మీ శరీరానికి ఎంతవరకు ఉపయోగ పడుతుంది, ఉపయోగపడదు అని మీరు సొంతంగా ఎప్పుడైనా ఆలోచించుకుంటున్నారా? ఆలోచనే అమృతం. ఆలోచన కంటే

గొప్పది ఏమిలేదటండి ఈ లోకంలో. సంసారాలలో ఏమి లోటు లేనివాళ్ళు కొంతమంది ఉండి ఉంటారు, అయితే లోటు లేనివాళ్ళు కూడా శాంతిగా ఉన్నారా? మీ సొంత బుద్ధి మీకు సుఖాన్ని తీసుకు వస్తుంది. మీ సొంత బుద్ధి మీకు శాంతిని తీసుకు వస్తుంది, మీ సొంత బుద్ధి ఆత్మని దర్శింపజేస్తుంది. పరాయి బుద్ధి వ్యతిరేక పరిస్థితులను తీసుకొచ్చి పెడుతుంది. అబద్ధం నిజంగా కనిపిస్తుంది, గాఢ నిద్రలో మనకి ఎవరికీ అహంకారం లేదు. అప్పుడు దుఃఖం అనుభవిస్తున్నామా మనం? లేదు. జ్ఞానికి ప్రపంచం ఆత్మలా కనిపిస్తుంది. జ్ఞానికి ఆత్మ. మనకి భగవంతుడు అని, ప్రపంచం అని, జీవుడు అని, ఇలా విడదీసుకుని చూసుకోవటం ఎందుచేతనంటే ఇక్కడ అహంకారం ఉంది కాబట్టి. మీ వెనకాల గోడ ఉంది చూడండి, ఈ గోడలోకి ఒక పెద్ద మేకును బలంగా లోపలకి కొట్టేశాను అనుకోండి, మేకు ఏమో లోపలకు బలంగా కొట్టాను. నెమ్మదిగా అలా లాగుతుంటే అది బయటకు వస్తుందా? బయటకు రాదు. అలా కొన్ని వేల జన్మల నుండి కొన్ని సంస్కారాలు లోతుకు దిగిపోయి ఉన్నాయి. ఏదో ఐదు నిమిషాలో, పది నిమిషాలో కృష్ణా రామా అంటే మటుకు ఆ తలంపులు బయటకి రావు. ఇదే కొన్ని వేల జన్మల నుండి అలవాటు చేసి ఉంచాం. ఈ గోడ లోంచి మేకు ఏమో చాలా బలంగా కొట్టేశాను లోపలకి, బయటకి తేలికగా లాగితే వస్తుందా? రాదు. అదే విధంగా మనం చేసే సాధనఏమి లేదు. సంస్కారాలు లోపల బలంగా ఉన్నాయి. ఒక్క సంస్కారం కూడా బయటకి రాదు. ఎంత బలంగా అయితే కొట్టానో, అంత బలంగా నా చెయ్యి పెట్టి లాగితే ఆ మేకు వస్తుంది. నేను వేల జన్మల నుండి ఈ సంస్కారాలు లోపల పెంచుకుని వాటికి బలం చేకూర్చాను, మళ్ళీ అంత కష్టపడితేనే కాని బయటకి లాగలేము. మీకు వాసన లేకపోతే బయట ఏమీ లేదు. ప్రపంచం ఏమీ లేదు, ఈ వాసనే ప్రపంచం ఉన్నట్టుగా కనిపిస్తుంది. దేవుడు మాట వదిలెయ్యండి, దేవుడు లేడు అని చెప్పినా అభ్యంతరం లేదు. మీలో మాకు సుఖం అక్కర్లేదు అని చెప్పే వాళ్ళు ఎవరైనా ఉన్నారా ఇక్కడ? మాకు సుఖం అక్కర్లేదు అని చెప్పేవాళ్ళు మీలో ఎవరైనా ఉన్నారా? స్త్రీలు గాని, పురుషులు గాని, అందరికి సుఖం కావాలి. కాని సుఖం ఎవరు అనుభవిస్తున్నారు చెప్పండి. మళ్ళీ మీకు మాకు గొడవలు దేనిని మధ్య వర్తిగా పెట్టుకోవద్దు మనం, డైరెక్ట్ గా మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాను. సుఖం అక్కర్లేదు అనిచెప్పేవాళ్ళు ఎవరైనా ఉన్నారా? అందరికీ సుఖం కావాలి. కానీ సుఖం ఎవరైనా అనుభవిస్తున్నారా?

మీరు ఇంటి దగ్గర కాని, బయట కాని ఎక్కడ ఏ పని చేసినప్పటికీ మీరు సుఖాన్ని కోరే మీరు ఆ పని చేస్తున్నారు. లోకానికి సంబంధించిన రహస్యం ఇంకొకటి చెబుతున్నాను.

మీలో ఎవరికి అయినా కోటి రూపాయలు సంపాదించాలి అని ఉంది అనుకోండి, ఆ కోటి రూపాయలు సంపాదించిన తరువాత నేను ఎంత సుఖం అనుభవిస్తాను అనిపిస్తుంది. సంపాదించక ముందు కోటి రూపాయలు సంపాదించటం గొప్ప ఘనకార్యం. కోటి రూపాయలు చేతిలోకి వచ్చాక వాడికి లోటుగా ఉంటుంది, ఇంత చేస్తే మనం కోటే సంపాదించామా అనుకుంటాడు. కోటి రూపాయలు సంపాదించడం అది achievement అని అనుకుంటాడు వాడు. కోటి రూపాయలు చేతిలోకి వచ్చాక ఇందులో ఏమీ లేదు అనిపిస్తుంది. అప్పుడు ఏమి చేస్తుంది మనస్సు? ఒక్క కోటే ఉంది, ఫలానా వాడికి పది కోట్లు ఉంది, ఫలానా వాడికి ఇరవై కోట్లు ఉంది, ఫలానా వాడికి ముప్లై కోట్లు ఉంది, అంత సంపాదించాలి కదా అని వాళ్ళ తోటి పోల్చుకుంటే ఈ కోటి తక్కువే కదా అనిపిస్తుంది. మరి కోటి యొక్క గమ్యం నిజం అయితే మనసు అక్కడ ఆగిపోవాలి కదా, కోటి రూపాయలు నిజంగా సంపాదించేశాడు. మనసు అక్కడ ఆగాలి కదా, ఆగదు. ఎందుచేత? అది నిజం కాదు. సంపాదించక ముందు వాడు అనుకుంటాడు గొప్ప achievement అని. సంపాదించిన తరువాత లోటుగా ఉంటుంది, ఏమి సాధించలేదు అనిపిస్తుంది. ఇది జీవిత రహస్యం.

కమిటీ ప్రెసిడెంటు పదవికి ప్రయత్నం చెయ్యండి, కష్టపడి ఆ కమిటి ప్రెసిడెంటు పదవి సాధిస్తారు. ఒక సంవత్సరం ఆరు నెలలు చేశాక ఇందులో ఏముంది అనిపిస్తుంది. ఆ పదవి తేలికగా అనిపిస్తుంది, మీకు ఉంది కాబట్టి తేలికగా అనిపిస్తుంది. హృదయంలో ఉన్న ఆత్మ దయా స్వరూపం. జ్ఞాపకం ఉంచుకోండి మీరు బయట కళ్ళతోటి చూసేవి అన్నీ, చేవులతోటి వినేవి అన్నీ మనసు కల్పించినవే. ఒక్క హృదయంలో ఉన్నదే నిజం. మనసు నిజం అనుకుంటారు కొంతమంది. శరీరం ఎంత అబద్ధమో, మనసు కూడా అంతే అబద్ధం. అర్థం చేసుకోవాల్సిన point మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోవాల్సిందే! ప్రతీవాడు నేను నేను అంటాడు, ఆ నేను కూడా ఒక తలంపే. నేను మటుకు నిజం కాదు. అది కూడా ఒక



**మోక్ష శాంతి, ఆత్మసుఖం ఏ హృదయగుహలో అయితే ఉందో అక్కడికి నువ్వు వెళ్ళేవరకూ నిన్ను గురువు వెంటాడతాడు నీకు అమృతానుభవం కలిగేవరకూ నిన్ను విడిచిపెట్టడు. నువ్వు మరిచిపోయినా నువ్వు పూజించక పోయినా గురువు మరిచిపోడు.**

తలంపే! ఆ తలంపుకే మనం పాలేరుతనం చేస్తున్నాం. ఈగ కూడా వాలనివ్వం ఆ నేను మీద, యదార్థం చెప్పాలి అంటే మీ భర్త కంటే ఈ నేనునే మీరు ఎక్కువ ప్రేమించుకుంటారు. మీ బిడ్డల కంటే ఈ నేనునే ఎక్కువ ప్రేమించుకుంటారు. మీ డబ్బు కంటే కూడా ఈ నేనునే ఎక్కువ ప్రేమించుకుంటారు. ప్రపంచంలోని వస్తువులు అన్నిటిని నేను కోసమే ప్రేమిస్తున్నారు మీరు. మీకు ఆ వస్తువులు ఎందుకు ఇష్టంగా ఉన్నాయి అంటే నిజంగా ఆ వస్తువు అంటే ఇష్టం కాదు, ఆ నేను కోసం ప్రియంగా కనిపిస్తుంది. కాని ఆ నేను కూడా ఒక తలంపే! సరళంగా ఉన్న సత్యం, సూటిగా ఉన్న సత్యం, ప్రత్యక్షంగా కనిపిస్తున్న సత్యం తెలుసుకోవడానికి మీకు ధైర్యం కావాలా? కంగారు ఎందుకు పుడుతుంది మనకి? ఈ చిన్న విషయాన్నీ అర్థం చేసుకోవడానికి మీకు ధైర్యం ఉండాలా? నేను ఎక్కడ ఉందో చూపించండి, మీరు అందరూ నేనునేను అంటున్నారు కదా, మీ తలంపును తీసేయండి. మీలో నేను ఎక్కడ ఉందో చూపించండి.

భగవాన్ వ్యక్తిత్వం అక్కర్లేదు అంటున్నారు. వ్యక్తిత్వం ఉండాలి కదా, మనిషికి వ్యక్తిత్వం లేకపోతే ఎలా అండి అంటున్నారు. మనిషికి వ్యక్తిత్వం ఉండాలి, అంటే ఒక గొప్పవాడు అనో, ధనవంతుడు అనో, కీర్తి ఉందనో, ఏదో ఒక వ్యక్తిత్వం ఉండాలి మనిషికి, వ్యక్తిత్వం ఏమి లేదు అనుకోండి. వ్యక్తిత్వం ఏమి లేకపోతే ఏమున్నట్టు? వ్యక్తిత్వం లేకపోతే సమాజంలో గౌరవం ఏముంటుంది? అందరికీ గౌరవాలు వద్దా? ప్రశ్న బాగుంది. చాలా మంచి ప్రశ్న, అందరికీ వ్యక్తిత్వం కావాలి, నా వ్యక్తిత్వం నాకు కావాలి, మీ వ్యక్తిత్వం మీకు కావాలి. కొంతమంది అంటారు ఆ మనిషి వ్యక్తిత్వం లేని మనిషి అండి అంటారు. ఆ శబ్దానికి అర్థం ఏమిటి అసలు? ఏమీ లేదు, వ్యక్తిత్వానికి, వ్యక్తిత్వం లేకపోవటానికి, కారణం ఏమిటి? వ్యక్తిత్వం ఉన్నవాడు పరిమితం అవుతాడు. అంటే వాడు ఒక్క ఊరికో, లేకపోతే ఒక కుటుంబానికో, ఒక దేశానికో, లేకపోతే ఒకరాష్ట్రానికో, లేకపోతే ఒక పరిసర ప్రాంతానికో పరిమితం అవుతాడు. వ్యక్తిత్వం లేనివాడికి పరిమితులు అంటూ ఉండవు. వాడు గొప్పవాడా? వీడు గొప్పవాడా? చెరువుకు చుట్టూ నాలుగు గట్లు ఉంటాయి. అప్పుడు వ్యక్తిత్వం ఉన్నట్టు లెక్క, సముద్రానికి గట్టు లేదు అయితే చెరువు గొప్పదా, సముద్రం గొప్పదా, వ్యక్తిత్వం ఉన్నవాడు గొప్పవాడా? వ్యక్తిత్వం లేనివాడు గొప్పవాడా? ఇప్పుడు చెప్పండి మీరు ఆలోచించి.

పరిమితులు పెట్టుకున్న వాడు వ్యక్తిత్వం ఉంది అనుకుంటాడు. జ్ఞానికి వ్యక్తిత్వంతో పనిలేదు. పరిమితులు లేవు వాడికి. అందుచేత వాడికి వ్యక్తిత్వం లేదు. పరిమితులు

ఉన్నవాడు గొప్పవాడా? పరిమితులు లేనివాడు గొప్పవాడా? ఈ ఒక్క వాక్యం మీరు అర్థం చేసుకోండి. అజ్ఞానికేవ్యక్తిత్వం ఉంటుంది వాడికి పరిమితులు ఉంటాయి కాబట్టి, జ్ఞానికి వ్యక్తిత్వం లేదు ఎందుచేత? వాడికి పరిమితులు లేవు. సముద్రానికి గట్టు లేదండి అయితే తక్కువదా? వ్యక్తిత్వం ఉన్నవాడు చుట్టూ నాలుగు గోడలు కట్టుకుంటాడు. వ్యక్తిత్వం లేనివాడు ఆకాశంలా ఉంటాడు. గురువు ఎప్పుడూ కూడా శిష్యుణ్ణి ఎన్నుకుని విద్య నేర్పుతాడు. అందుకే రామకృష్ణుడు కావాలి, కావాలి అని వివేకానందని ఎన్నుకున్నాడు. చేలో మంచిగా దమ్ము చేసి, దానిలో మట్టి వేసి, సారవంతం చేసి అప్పుడు విత్తనం నాటితే ఆ విత్తనం ఎంత బలంగా వస్తుందో, అదే విధంగా మంచి శిష్యుడికి, యోగ్యత అర్హత ఉన్న శిష్యుడికి విద్య చెప్పమన్నాడు. అది అభివృద్ధి అవుతుంది అని చెపుతున్నారు ఆచార్యులవారు. వివేకానంద రాకపోతే ఎవరి చేత అయిన కబురు పంపేవాడు ఆయన. ఏవండీ ఆయన్ని చూసి చాలాకాలం అయ్యింది, ఒకసారి చూడాలని ఉంది రమ్మనేవాడు అట. పరమహంస గారు వివేకానందకి ఎవడైనా పెళ్లి చేసేస్తాడేమో అని, తెలియని వారు వచ్చేటప్పటికి వణికిపోయేవారు అటండి. ఎందుచేత అంటే కుర్రాడు అందంగా ఉన్నాడు B.A., పాస్ అయ్యాడు, ఎవరైనా పెళ్లి చేసేస్తారేమో అని. మన విద్య అంతా ఎవడు చెపుతాడు లోకానికి అని. నరేన్ నా విద్యని అంతా నీకు సమర్పించి నేను బీదవాడిని అయిపోయాను అన్నాడు మరణించే రోజులలో. రామకృష్ణ అన్నాడండి నరేన్ నీకోసం నా సర్వస్వం త్యాగం చేశాను. నాకున్న శక్తులు అన్నీ నీకు ఇస్తున్నాను. నాకున్న విద్యలు అన్నీ నీకు ఇచ్చి, నా హృదయం కూడా నీకు ఇచ్చి నేను బీదవాడిని అయిపోయాను నరేన్, వాడు గురువు. బహు పేదవాడి స్థితి ఎలా ఉంటుందో నా స్థితి అలాగే ఉంది. ఎందుచేత? నాకంటూఇంక శక్తి లేదు. నాకున్నవి అన్నీ నీ చేతిలో పెట్టాను అనేవారట రామకృష్ణులు. నువ్వు ఇచ్చే శక్తులు, నువ్వు ఇచ్చే విద్యలు అన్నీ నాకు ఎందుకు? నాకు సమాధి స్థితి కావాలి. దైవ దర్శనం అవ్వాలి అనేవాడు నరేన్. నీకు సమాధి స్థితి కదా కావాల్సింది, తేలికగా వస్తుంది సమాధి స్థితి. నీ శరీరం ద్వారా లోకంలో ఎంతో ఉద్ధారణ జరగాలి, అందుకే నా శక్తిని నీకు ప్రసాదిస్తున్నాను. 40 సంవత్సరం లోపులో నువ్వు శరీరం విడిచిపెట్టి బయటకి వెళ్లిపోతావు. సమాధి స్థితిని పొందుతావు. నీకు సమాధి స్థితి కావాలి అని అడుగుతున్నావు. నీ శరీరం పడిపోయేలోపు ఈ సమాధి స్థితి నిజంగా వస్తే రాకుండా నువ్వు ఆపు చేసుకోవాలి అన్నారు. ఎందుచేత? నీ ద్వారా లోకోద్ధరణ జరగాలి.


జ్ఞానికి సేవ చెయ్యి, జ్ఞాని యొక్క హృదయం పొంగితే అతని హృదయంలో రహస్యం

అంటూఏమి లేకుండా తనకున్న విద్యనంతా నీకు ప్రసాదిస్తాడు అని చెప్పాడు గీతలో. మీకు శిష్యులు లేరాఅని రమణ స్వామిని అడిగితే, నేను ఎవరి దగ్గర మంత్రం పుచ్చుకోలేదు, నేను ఎవరికీ మంత్రం ఇవ్వలేదు. గురు శిష్య సాంప్రదాయం అని భగవాన్ నోటి ద్వారా ఎప్పుడూ చెప్పలేదు. నువ్వు నా శిష్యుడు అనిఎవరితోటి చెప్పలేదు భగవాన్. కాని ఎవరైనా ఆయన్ని గురువు కింద భావిస్తే మటుకు ఆయన వద్దు అనలేదు. మిమ్మల్ని గురువుగా భావిస్తున్నాను. మీరు అంగీకరిస్తారా? ఒక ప్లీడరు గారు అడిగారు. నేను గురువు, నువ్వు శిష్యుడు అన్న సంగతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు నువ్వు నేను వెళ్లి సంతకాలు పెట్టి రిజిస్టర్ చేయించుకుంటేనే కాని నువ్వు అంగీకరించవేంటి అన్నారు భగవాన్. నోటి మాట కాదు అది ఆత్మ శక్తి. మీరు నోటి తోటి చెప్పక్కర్లేదు వీరు నా గురువు అని, మనసులో ఆరాధిస్తే చాలు. ఇప్పుడు ఎవరైతే మీ ఇంట్లో ఉన్నారో మీ ఇంట్లో సభ్యుల తోటి సంబంధాలు తెగిపోతాయి కానీ గురువు తోటి సంబంధం తెగదు ఆలోచించుకోండి. దేశం విడిచిపెట్టి, దేశం కాని దేశం ఇక్కడకొచ్చి నీ పాదాలు దగ్గర పడి ఉన్నాను. మీకు శరీరం విడిచిపెట్టే పరిస్థితి వచ్చింది. మరి ఏనాటికోమనం కలుసుకోవటం అని భగవాన్‌ను అడిగితే అప్పుడు భగవాన్ అన్నారు పూర్వ జన్మలో ఏ సంబంధం లేకుండా మనం ఇక్కడ కలుసుకున్నామా? ఈ సంబంధం మనలని మరొక చోట కలపదా? అంటే గురువు విడిచిపెట్టడు. మనం ఉన్నామంటే ఎన్ని పనులో, ఇంటికి ఎప్పుడు వెళ్లిపోదామా, పనులు అన్నీ చూసుకుందామా అనిపిస్తుంది మనకి. ఎన్ని పనులు ఉన్నాయో ఇంటి దగ్గర. అని అనుకుంటే వాడు అజ్ఞానే. జ్ఞానికి పని ఏమిటి అసలు, అజ్ఞానికి పని ఉంది కాని జ్ఞానికి పనే లేదు. జ్ఞాని ద్వారా పని జరుగుతుంది గాని నేను పని చేస్తున్నాను అని జ్ఞాని అనుకోడు. పని జరగటం వేరు, పని చెయ్యటం వేరు. జ్ఞానికి కర్తృత్వం ఉండదు, అజ్ఞానికి కర్తృత్వం ఉంటుంది. జ్ఞానికి పనిచేసినా దుఃఖం రాదు, అజ్ఞానికి పనిచేస్తే దుఃఖం వస్తుంది. అందరికి తలొక పని ఉంది కదా, పని ఉంది అనుకుంటున్నాం అంటే మనం అజ్ఞానులం అని అర్థం. మనకు ఏదైనా పని ఉంది అనుకుంటున్నాం అంటే మనం అజ్ఞానంలో ఉన్నట్టే.

ఇక్కడ ఏమిచెబుతున్నాడు అంటే ఈ లోకంలో నువ్వు చేసే దానాలు ఏవి అభివృద్ధిలోకి వస్తాయి అంటే సత్పురుషులకి ఇచ్చే దానం. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి, దానం వేరు, ధర్మం వేరు. ఇవి రెండూ సమానం అనుకోకండి. దానం వేరు, ధర్మం వేరు. ధర్మం అంటే ఏమిటి? ఇంటికాడకి వచ్చే వాళ్లకి ఐదు పైసలు, పది పైసలు చిల్లర వేస్తారు చూడండి, ఎవరోముష్టివాళ్ళు వస్తారు కదా, అది ధర్మం. దానం అలా కాదు, ఇది ఎవరికి

ఇస్తే మంచిదో ఆలోచించి, ఎవరికి ఇస్తే దానిని సద్వినియోగం చేస్తారో ఆలోచించి ఇస్తే అది దానం. ధర్మం వల్ల ఏమీ చెడ్డ లేదు. దానం కనుక అపాత్రుడికి దానం చేస్తే మీకు మళ్ళీకర్మ చుట్టుకుంటుంది. వాడు దుర్మార్గుడు అయినా ఫరవాలేదు. మీ ఇంటికి వచ్చి ఎవరైనా అన్నం పెట్టమన్నారు అనుకోండి అన్నం పెట్టి పంపేస్తాం. అక్కడితో అతడికి, మీకు ఉన్న సంబంధం తెగిపోతుంది. అది ధర్మం దానివల్ల మీకు ప్రమాదం లేదు. దానం అలా కాదు, దానం ఎవరికి ఇవ్వాలి? సత్పురుషులు అయిన వారికి, ఎవరికి అయితే దానం ఇస్తే సద్వినియోగం చేస్తాడో వారికిదానం ఇవ్వాలి కాని మీ దగ్గర ధనం ఉన్నా సరే పుచ్చుకునేవాడికి పాత్రత లేకపోతే వాడికి దానం చెయ్యకూడదు. దానివల్ల మీకు పుణ్యం రాదు కాని తిరిగి పాపం వస్తుంది. అందుచేత మీ దగ్గర ధనం ఉంటే మీరు ఎప్పుడైనా దానం చేస్తే, మీ వివేకం తోటి జాగ్రత్తగా ఆలోచించి, మీ తెలివి తోటి ఆలోచించుకుని, సహృదయం కలవాడికి, నిజంగా బాధ పడుతున్న వాడికి, ఎక్కడైతే దానం చేస్తే అది ఉపయోగపడుతుందో బాగా ఆలోచించి అక్కడ దానం చెయ్యండి. పేకాట ఆడే వాడికి దానం చేస్తారు అనుకోండి, అది దానమా? ఏవండీ మీరు ఎప్పుడు చూసినాకర్మ అనుభవిస్తున్నాను,కర్మ అనుభవిస్తున్నాను అంటారు. మీరు సుఖంగానే ఉన్నారు కదా. కర్మ అనుభవించటం ఏమిటి, మీ కొడుకులు అందరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు, అంతా బాగున్నారు కదా, అని అడిగారు. నేను చేసుకున్నకర్మ అంతా నా పెద్దకొడుకు రూపంలో వచ్చిందిఅన్నాడు. మనకిఏమి తెలుసు సంసారంలో ఏమి గొడవలు ఉన్నాయో, పెద్ద కొడుకు బాధపెడుతున్నాడు అటండి ఆయనని. నేను కర్మ చేసుకోకపోతే నాకు ఇటువంటి పెద్ద కొడుకు ఎందుకు పుడతాడు. వీడి ద్వారా నేనుకర్మ అనుభవిస్తున్నాను. అంటే అది నేను చేసుకున్న చెడ్డ దానిని నేను అనుభవించాలి అందుచేత నా పెద్దకొడుకు రూపంలో ఈశ్వరుడు పంపాడు అన్నారు. కొంతమంది దేశంలో ఎన్ని తగువులు అయినా తీరుస్తారు

**గురువు బోధ దేని మీద ఆధారపడి ఉంటుంది అంటే,**
**నీ మనస్సును నీ చేతనలను నీకు ఎన్ని అయితే శక్తులు**
**ఉన్నాయో, ఆ శక్తులన్నింటినీ ఒక చోటకు**
**తీసుకువచ్చి, మొత్తం ఆ శక్తి అంతా లోపలికి**
**మళ్లించటమే గురువు చేసే పని.**



కాని పాపం కొడుకులు ఎదురు తిరిగారు అనుకోండి లొంగిపోతారు. బలహీనత అది. దేశంలో తగువులు తీర్చమంటే ఎన్నైనా తీరుస్తాడు. కాని ఇంట్లో కొడుకులు ఎదురు తిరిగారు అనుకోండి వాడికి వెంటనే ముసలితనం వచ్చేస్తుంది మంచం ఎక్కేస్తాడు. ఇంక అక్కడ తీర్పు చెప్పలేడు. దానికి మోహం కారణం.

పూర్వం కర్ణుడు ఉండేవాడు అనుకోండి, కలియుగంలో గొప్ప దాత ఎవరు అంటే మీరు పేరు వినే ఉంటారు C.R. దాసు గారు. చిత్తరంజన్ దాసు గారని కలకత్తాలో ఉండేవారు ఆయన, ఆయన సుభాష్ చంద్రబోసు గురువు. దాసుగారి జేబులో డబ్బు ఉంటే కలకత్తాలో ఉన్న ప్రతీపౌరుడు నా జేబులో డబ్బు ఉంది అనుకుంటాడు. లేదు అని దాసు గారి నోటి వెంట ఎప్పుడూ రాలేదు. C.R. దాసు గారి తాతగారు ఏదో వ్యాపారం పెట్టి నష్టం వస్తే, తాతగారు దివాలా తీస్తే ఈయన కలకత్తా హైకోర్ట్‌లో ప్లీడరు పట్టా పొంది లక్షలాది రూపాయలు సంపాదించి తాతగారు ఎవరెవరికి అయితే డబ్బు ఇవ్వాలో ప్రతి వాడి ఇంటికి వెళ్లి మా తాత నీకు ఎంత ఇవ్వాలి? అని వడ్డీతో సహా సరిపెట్టాడు అట. వాడు దాసు. నోట్లు లేవు ఏమి లేవు మా తాత ఎంత ఇవ్వాలి? మా తాత ఇంత ఇవ్వాలా? అని అడిగి వడ్డీతో సహా సరిపెట్టేశాడు కలకత్తా అంతా తిరిగి, ఆయన C.R. దాసు.

సోదరమహాశయులారా! మీకు తెర మీద బొమ్మ చూసినట్టు ఉండదు ఈశ్వరానుగ్రహం, తళతళ మెరిసిపోతున్నట్టు ఉండదు. ఈశ్వరానుగ్రహం మీ కళ్లకు కనపడదు. అతి రహస్యంగా, అతి గంభీరంగా, మీ బుద్ధికి అందకుండా, మీ మనస్సుకు అందకుండా, మీ తెలివికి అందకుండా అతి వేగంగా ఈశ్వరానుగ్రహం పనిచేస్తుంది. ఆ పని చేసినప్పుడు గనుక మీరు పట్టుకుంటే మీ అజ్ఞానం పటాపంచలు అయ్యి కొట్టుకుపోతుంది. అతి బలంగా వస్తుంది ఈశ్వరానుగ్రహం. వచ్చినప్పుడు ఎన్ని వేల జన్మల నుంచి మీకు అజ్ఞానం ఉన్నా సరే, అలాకూలిపోయి రాలిపోతుంది. సర్వసాధారణంగా బయట చేసే పనులు, వాడు ఇంత గొప్ప పని చేశాడు అండి, ఈ డాబా ఎంత బాగుంది, ఈ పొలం ఎంత బాగుంది, ఈ గోడ ఎంత బాగుంది, ఇలా బాహ్యంగా కనిపించదు ఈశ్వర అనుగ్రహం. అలా అన్నిటిలా రాదు ఈశ్వర అనుగ్రహం, ఎప్పుడు వస్తుంది? రహస్యంగా వస్తుంది. అతి వేగంగా వస్తుంది. అతి బలంగా వస్తుంది. ఎన్నో వేల జన్మల నుండి మిమ్మల్ని బాధ పడుతున్న అజ్ఞానం ఒక్క సెకనులో పోతుంది. అది మీ బుద్ధికి అందదు, మీ కళ్లకు అందదు. మీ మనస్సు తోటి ఆలోచిద్దాం అంటే మీ తెలివికి అందదు. కాని తీవ్రమైన

వేగంతో వస్తుంది, అప్పుడు మీకు ఊపిరి కూడా సలపదు. అది మీ శిరస్సు మీద వర్షంలా కురిసినప్పుడే మీకు తెలుస్తుంది ఈ రహస్యం. కొన్ని సెకన్లు చాలు ఈశ్వర అనుగ్రహం రావడానికి. మీరు ఏదైతే నిజం, నిజం అనిఅనుకుంటున్నారో, ఏ ఆదర్శం కోసం మీరు జీవిస్తున్నారో, అవన్నీ కూడా మనకున్న పిచ్చి పిచ్చి ఆలోచనలు, పిచ్చి పిచ్చి చేష్టలు ఇందులో ఏమీ సారం లేదు అని తెలుసుకోవడానికి ఈశ్వర అనుగ్రహం రావలసిందే కాని అప్పటివరకు కేవలం మనం సాధన చేసినప్పటికీ కోటిజన్మల తరువాత కూడా ఇంతే.

సోదరమహాశయులారా! ఈశ్వర అనుగ్రహం లేకుండా ఎవరూ జ్ఞాని కాలేడు. నేను చేతులు పైకి ఎత్తి మరి చెబుతున్నాను. ఈశ్వరానుగ్రహం లేకుండా మటుకు ఎవడూ జ్ఞాని కాలేడు. మీరు ఏమైనా యజ్ఞాలు చేసినా, యోగాలు చేసినా, తపస్సులు చేసినా, నేను ఇంత యోగాభ్యాసం చేశాను, ఇంత సాధన చేశాను, అనిమీరు ఎవరు గర్వ పడకండి. వాటి వల్ల జ్ఞానం రాదు. ఎక్కడ వస్తుందో తెలియదు. ఏ జన్మలో ఇస్తాడో తెలియదు, వచ్చినప్పుడు మటుకు అనుగ్రహ ప్రవాహంలో ముంచేస్తాడు. ఈ తలుపులు అన్నీ మూసేసి, ఈ పక్క తలుపులు మూసేసి ఒక వెయ్యి సంవత్సరాలు ఈ స్కూలు ఇలా ఉంచితే అక్కడ చీకటిగా ఉంది అనుకోండి దీపం వెలిగిస్తాము. నేను వెయ్యి సంవత్సరాల నుండి ఈ స్కూల్‌లో ఉంటున్నాను నేను చీకటిని, ఈ దీపం వెలిగించినా నేను బయటకు వెళ్లను అని చీకటి చెబుతుందా అండి? దీపం వెలిగించిన వెంటనే చీకటి పోతుంది. అదే విధంగా మనం ఎన్ని కోట్ల జన్మల నుండి అజ్ఞానంలో ఉన్నప్పటికీ ఆ ఈశ్వరానుగ్రహం వచ్చేటప్పటికి మీ హృదయంలోని అజ్ఞానం అనే చీకటి రాలిపోతుంది. అది వచ్చే వరకు, ఆ సెకను వరకు, ఆ శుభ గడియ వరకు మీకే తెలియదు అసలు, ఊరికే ప్రిపేర్ అయ్యి ఉండటమే, సిద్ధంగా ఉండటమే, ఇప్పుడు వేరుభావన లేకుండా మటుకు ఉండలేరు. ఆ ఈశ్వరానుగ్రహంవచ్చిందా, వేరుభావనని ఆపు చేసుకుందాం అంటే ఆపు చేసుకోలేము. ఈశ్వరానుగ్రహం వచ్చింది అంటే వేరుభావన రాలిపోతుంది. ఈ వడ్లవానిపాలెంలో భక్తులకి నా విజ్ఞప్తి ఏమిటి అంటే ప్రతిరోజూ ఒక గంట సేపు ఎక్కడో ఒక చోట మీరు కూర్చొని భగవద్గీత కాని, భాగవతం కాని పుచ్చుకుని మంచి పుస్తకం కూడా మంచి స్నేహితుడుతో సమానం. పదిమంది ఒకచోట కూర్చొనిఏదైనా గోష్టి చేసుకోవటం చాలా మంచిది. కాలాన్ని మటుకు అనవసరంగా పాడు చెయ్యకండి. రోజులు వేగంగా మన మీదకు వచ్చి పడుతున్నాయి. కాలాన్ని వృధా చెయ్యద్దు. రోజూ ఒక గంట సేపు మటుకు ఈశ్వరుడికి మీరు ఇవ్వలేరా? ఇరవై నాలుగు గంటలు అనుకోండి ఇరవై నాలుగు గంటలలో ఎనిమిది

గంటలు నిద్రపోతున్నారు అనుకోండి ఇంకా ఎన్ని గంటలు పదహారు గంటలు ఉన్నాయి. పదహారు గంటలలో పదిహేను గంటలు మీ సంసారం కోసం పనిచేసుకోండి పోనీ. ఒక గంట ఈశ్వరుడికి ఇవ్వలేరా? పదిహేను గంటలు మీ సంసార గొడవలకి ఖర్చు పెట్టి, ఒక్క గంట ఈశ్వరుడికి ఇవ్వలేరా? మీ డబ్బు అడగటం లేదు ఈశ్వరుడు. ఒక్క గంట టైము అడుగుతున్నాడు. వడ్లవానిపాలెంలో ఏదో ఒకచోట అనుకుని మీకు ఇష్టమైన గ్రంథం ఒకటి తీసుకుని ఒక్క గంట సేపు సత్కాలక్షేపం చెయ్యండి అని ప్రార్థిస్తున్నాను. మీరు దేవుణ్ణి మార్చుకోవక్కర్లేదు. మీది ఏ మతం అయితే ఆ మతంలో ఉండండి. మీరు ఏ దేవుణ్ణి ప్రార్థిస్తే ఆ దేవున్నేప్రార్థించుకోవచ్చు. కాని ఏదొక మంచి గ్రంథం మటుకు ఒక గంట సేపు ధ్యానం చేసుకుంటూ ఉండాలి.


సోదరమహాశయులారా! చివరిసారిగా ఒక మాట చెబుతున్నాను. మతాలన్నీ క్రైస్తవ మతం, హిందూ మతం, మహమ్మదీయ మతం, జైనుల మతం ఇలా ప్రపంచంలో నాలుగు ఐదు మతాలున్నాయి అని చెబుతున్నారు. ఇది అబద్ధం, బుర్రకో మతం ఉంది. ప్రపంచంలో మూడు వందల కోట్ల మంది జనాలు ఉన్నారు, మూడు వందల కోట్ల మతాలు ఉన్నాయి. మనం అందరం హిందువులమే కదా అయితే మనం అందరం ఒకలా ఉన్నామా? బుర్రకో మతం ఉంది. ప్రపంచంలో ఇప్పటివరకు ఒకే మార్గంలో జ్ఞానం పొందిన వాళ్ళు ఇద్దరు లేరండి ఈ సృష్టిలో. నేను రమణ భగవాన్ భక్తుడను అయ్యుండచ్చు కాని ఆ మార్గంలో నేను జ్ఞానం పొందలేను. బుర్రకో మతం ఉంది. అందుచేత మిమ్మల్ని జాగ్రత్తగా ఆలోచించుకోమని చెబుతున్నాను. అనుకరణ పనికిరాదు, మీరు ఒక గంట సేపు జపం చేసుకుంటారు అనుకోండి, ఒక అరగంట సేపు పూజ చేసుకుంటారు అనుకోండి, ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మీ హృదయంలో, మీ పేగుల్లో, మీ నరాల్లో అట్టే పెట్టుకోవాలి ఈ మాట. ఏ మాట? మీరు ఒక అరగంట సేపు జపం చేసుకుంటే, అరగంట పూజ చేసుకుంటే ఈ అరగంట మీరు అభివృద్ధి అవుతున్నారు అన్న సంగతి మీరు మర్చిపోకండి. అభివృద్ధి మీ కళ్ళకు కనపడదు. మీరు పది నిముషాలు ఇంటికాడ జపం చేసుకుంటారు అనుకోండి, ఆ జపం యొక్క ఫలితం మీ కళ్ళకు కనపడదు. కాని పది నిముషాలు కూడా మనం అభివృద్ధి చెందినట్టే. ప్రయత్నం చేసినంత మాత్రం చేత మీరు జ్ఞానులు అవ్వలేరు. ప్రయత్నం అవసరమే అంత మాత్రం చేత మీరు జ్ఞానులు అవ్వలేరు. ప్రయత్నం వల్ల అభివృద్ధి చెందుతారు. మీకు ప్రయత్నం ఒక్కటే కాదు ఈశ్వరానుగ్రహంకూడా కలిసి రావాలి. ఇనుప పెట్టి నీ దగ్గరే

ఉంది, తాళం చెవి మటుకు ఈశ్వరుడు ఇవ్వాలి. ఇనుప పెట్టి నీ దగ్గరే ఉంది. ఇనుప పెట్టెలో డబ్బు ఉంది, కానీ తాళం చెవి మటుకు ఈశ్వరుడు నీ చేతికి అందివ్వాలి. డబ్బు నీదే, పెట్టి నీదే, తాళం చెవి మటుకు నీ దగ్గర లేదు. ఎలా వస్తుంది నీకు డబ్బు? హృదయంలో ఉన్న భగవంతుడు, హృదయంలో ఉన్న ఆత్మ నీవే. కానీ ఆయన నీకు తెలియటం లేదు. అంటే హృదయంలో ఉన్న స్వామి తనని తెలుసుకునే తాళం చెవి నీకు ఇస్తాడు. అది అనుగ్రహం అంటే! చివరిసారిగా కఠినమైన మాట చెప్పేస్తున్నాను. నిజం అనేది తనను తెలుసుకోమని కోరుతుందా? అబద్ధాన్ని తెలుసుకోమని కోరుతుందా? మీరు బాగు పడుతుంటే మిమ్మల్ని బాగు పడమని కోరతానా? మిమ్మల్ని పాడైపోమని కోరతానా? నిజంగా నాలో ఆత్మ ఉంది, నాలో సత్యం ఉంది. ఈ సత్యం తనని తెలుసుకోడానికిప్రయత్నం చెయ్యమని చెబుతుందా? లేకపోతే బయటి గొడవలు చూసుకోమని చెబుతుందా? సత్యం నిజంగా అలా కోరుతుందా లేకపోతే జీవుడు బయటకి వెళ్ళిపోయి పాడయ్యిపోతే బాగుండును అని కోరుతుందా? మీరు ప్రశాంతంగా ఆలోచించండి. హృదయంలో ఉన్న సత్యం చెప్పినట్టే మీరు చెయ్యండి. నేను చెప్పినట్టు మీరు చెయ్యకండి. మీ హృదయంలో భగవంతుడు ఆత్మ రూపంలో, సత్య రూపంలో ప్రకాశిస్తున్నాడు కాబట్టి, ఒక్కసారి మీ మనసు లోపలకి తిప్పుకుని మీ హృదయంలో ఉన్న ఆత్మ ఎలా చెబితే అలా చెయ్యండి. ఒక్కసారి కూడా సత్యం అందుకోరా మీరు? కనీసం ఆ మాటలు మీకు వినపడటం లేదా? ఆ శబ్దం వినపడటం లేదా? ఆ రూపం కనపడటం లేదా? ఆ వాణి వినపడటం లేదా?


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహాత్మ్యం
# అక్షరమణమాల

**కనిన జననికన్న ఘనదయా దాయకా**
**ఇదియా అనుగ్రహ మరుణాచలా! । 6 ।**

**తాత్పర్యము:** లోకములో కన్న తల్లి ప్రేమ ఎంతో మిన్న. ఆ కన్నతల్లిని మించిన కరుణామయుడవు నీవు. తల్లి దేహాన్ని మాత్రమే శుద్ధి చేస్తుంది. కానీ నీవు దేహాన్ని, ఇంద్రియాలను, మనస్సును కూడా శుద్ధి చేసి, నీ ఆత్మ సామ్రాజ్యానికి నన్ను చక్రవర్తిని చేసావు. నీ అనుగ్రహాన్ని ఏమని చెప్పను అరుణాచలా!

ఏసు క్రీస్తు అన్నాడు, తప్పి పోయిన గొర్రెలు అంటే నాకు బాగా ఇష్టం. అంటే, నలుగురు పిల్లలు ఉంటే, అందులో ఎవడైనా ఒకడు పాడైపోతే, తల్లి వాడి గురించే ఆలోచిస్తూ ఉంటుంది. అంటే, మోక్షానికి వెళ్ళే మార్గం ఎవడైతే తప్పిపోయాడో, వాడిని పట్టుకొని, సరి చేసి, మళ్ళీ వాడిని మంచి మార్గంలో పెట్టాలని చూస్తాను అని చెప్పటానికి, తప్పి పోయిన గొర్రెలు అంటే నాకు బాగా ఇష్టంఅన్నాడు ఏసు క్రీస్తు. రాంగ్ పాత్‌లో ఉన్నవాళ్ళని, మళ్ళీ తీసుకెళ్లి రైట్ పాత్ లో పెట్టాలని చెప్పాడు. మీరందరూ వాడిని చెడ్డవాడు అని ఊరికే విమర్శించి వదిలేస్తారు అంతే. తల్లి వాడిని మంచి మార్గంలో పెట్టటానికి అన్నివిధాలా ప్రయత్నం చేస్తుంది.

ఓ అరుణాచలేశ్వరుడా! కనిన జనని కన్న ఘన దయా దాయకా - అంటే తల్లిప్రేమ చూశారు, తండ్రిప్రేమ చూశారు. భౌతికమైన ప్రేమలలో అందరి ప్రేమ కంటే తల్లి ప్రేమ గొప్పది. అటువంటి తల్లి ప్రేమ కూడా, నీ ముందు ఏపాటిది అరుణాచలేశ్వరుడా! నన్ను జ్ఞానంతో అలంకరించావు. మామూలుగా భౌతికంగా ఆలోచిస్తేతల్లిప్రేమ గొప్పదే, కానీ నీ ముందు, నీ ఆప్యాయత ముందు, నీ కంపాషన్ ముందు, నీ మేర్సీ ముందు తల్లి ప్రేమ ఏపాటిది అరుణాచలేశ్వరుడా! తల్లికి దయ ఉంటుంది, కానీ నీతోటి పోల్చినప్పుడు తల్లి దయ ఏపాటిది? తల్లిప్రేమని నీతోటి పోల్చగలమా! నీయొక్క దయ, నీయొక్క అనుగ్రహం అటువంటిది. నువ్వు ఏమిచేశావు అంటే, నీకు నాకు మధ్య ఉన్న బేధబుద్ధిని తీసేసి, నన్ను నీలో ఐక్యం చేసుకున్నావు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**బుద్ధి యుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే।**

**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలం ॥ 2-50 ॥**

**తాత్పర్యము:** సమత్వ బుద్ధియుక్తుడు అయిన వాడు పుణ్యపాపములను రెండింటిని ఈ లోకమునందే త్యజించును. అనగా కర్మఫలములు వానికి అంటవు. కనుక నీవు సమత్వబుద్ధి రూపయోగమును ఆశ్రయింపుము. ఇదియే కర్మాచరణమునందు కౌశలము. అనగా కర్మబంధము నుండి ముక్తుడగుటకు ఇదియే మార్గము.

నువ్వు కర్మ ఎలా చెయ్యాలి అంటే, సమాన బుద్ధి తోటి చెయ్యాలి. సమాన బుద్ధి తోటి చెయ్యటమే యోగము. పని బాగా చెయ్యటం మంచిదే. పనిలో నేర్పు ఉండాలి అంటారు కదా. పనిలో నేర్పు అంటే, మీరు వంట పనో లేకపోతే వడ్లంగి పని చేస్తారు అనుకోండి, ఆ పని బాగా చెయ్యటమే కాదు, ఆ పని తాలూకు ఫలితం మీకు అంటకుండా కూడా ఉండాలి. యోగం అంటే అది. నేర్పు అంటే అది. మీరేదో సత్కర్మ చేస్తారు, సత్కర్మ చేసి మీరేదైనా ఆశిస్తారు అనుకోండి, అది మీకు అంటుకొంటుంది. అది నేర్పు కాదు. సత్కర్మ ఎలా చెయ్యాలి అంటే పర్ఫెక్ట్ గా చెయ్యాలి, అంటే ఏమీ దోషం లేకుండా చెయ్యాలి. ఆ చేసే పని నేర్పుతో చెయ్యాలి. ఆ చేసే సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. మీరు చేసిన కర్మ ఫలితం మీకు అంటుకోకూడదు.

యోగః కర్మసు కౌశలం - కౌశలం అంటే నేర్పు. కొంతమంది పని బాగా చేస్తారు. ఇక్కడ భగవంతుడు ఏమని చెపుతున్నాడు అంటే - పని బాగా చెయ్యటమే కాదు నువ్వు నేర్చుకోవలసింది, ఆ పని చేసి నువ్వు ప్రశంసలను కూడా కోరకూడదు. అది యోగం. కౌశలం అంటే అర్థం ఏమిటంటే మీరు కర్మ బాగా చేస్తే సరిపోదు, మీ కర్మ తాలూకు ఫలితం కూడా మీకు అంటుకోకుండా చెయ్యాలి. అది నేర్పు. పని బాగా చేస్తే దానిని నేర్పు అంటారు అని మీకు అందరికీ తెలుసు. అది ఒకటే కాదు, ఆ కర్మ ఫలితం మీకు అంటుకోకుండా కూడా చెయ్యాలి. అది కూడా నేర్పు తోటి సమానం. యోగః కర్మసు కౌశలం - ఇవన్నీ మంత్రాలు.

బుద్ధి యుక్తుడు - అంటే సమాన బుద్ధి కలవాడు, సహృదయం కలవాడు; జహాతీహ ఉభే సుకృతదుష్కృతే - వాడు చేసిన పాపాన్ని, వాడు చేసిన పుణ్యాన్ని, శరీరం ఉండగానే ఇక్కడ వదిలేసి, తరువాత శరీరం విడిచిపెట్టేసి వెళ్ళిపోతాడు. మీరు కొంచెం పుణ్యం చేస్తే, ఈ పుణ్య ఫలితం కావాలి అని కోరుకుంటారు. అది తప్పు. మీ శరీరం ద్వారా కొన్ని మంచి కర్మలు జరగవచ్చు, కొన్ని చెడ్డ కర్మలు జరగవచ్చు. మీ శరీరానికి మరణం రాకముందే, ఎవడైతే పుణ్య కర్మలు పాప కర్మలు ఈ లోకంలోనే విడిచిపెట్టేసి, లగేజ్ ఏమీ లేకుండా చేసుకొని, తేలికగా ప్రాణం విడిచిపెట్టి బయటికి వెళ్లిపోతున్నాడో, వాడు బుద్ధిమంతుడు. బుద్ధిలేని వాడు పుణ్య పాపాలను కూడా మోసుకెళ్తాడు. అక్కడ స్వర్గమో నరకమో సిద్ధంగా ఉంటాయి. ఇవి రెండూ మోసుకెళ్తే స్వర్గం అనుభవించాలి నరకం అనుభవించాలి. ఇవి రెండూ ఇక్కడ వదిలేసిన వాడికి నరకం లేదు స్వర్గం లేదు, హాయిగా ఉంటాడు. అందుచేత లగేజీ అంతా ఇక్కడ విడిచిపెట్టిసి వెళ్లమన్నారు.

బుద్ధి యుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే - పాప పుణ్య కర్మలు అన్నీ మీ శరీరం విడిచిపెట్టక ముందే ఇక్కడ విడిచిపెట్టాలి. అలా విడిచిపెట్టటం అంత తేలిక కాదు. దానికి తగిన ట్రైనింగ్ పొందు. బడిలో పాఠం చెప్పటానికే ట్రైనింగ్ ఇస్తున్నారు కదా. అలా విడిచిపెట్టటానికి నువ్వు ట్రైనింగ్ పొందు అర్జునా! అంటే పుణ్య పాపాలు ఇక్కడ ఎలా విడిచిపెట్టాలో నేర్చుకో అని చెపుతున్నాడు.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

**SRI RAMANA KSHETRAM A/c. No. 6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
**IFSC Code : IDIB000V142, Contact No. 9866715896**

# శ్రీకృష్ణాష్టమి

ప్రతీ సంవత్సరం శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమిని, పర్వదినంగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. దేశ, విదేశాలలో లక్షలాది మందికి శ్రీకృష్ణుడు ఆరాధ్య దైవం. శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, శ్రీశంకర జయంతి, శ్రీరమణ జయంతి ఇలాగ అవతార పురుషుల జన్మదినాన్ని జరుపుకుంటూనే ఉన్నాం. గత నెలలో వ్యాస జయంతిని, గురుపూర్ణిమగా జరుపుకున్నాం! పుట్టినరోజు అంటే ఆత్మ పుట్టదు, ఆత్మ అనంతం, అఖండం, అద్వితీయం. మరి పుట్టినరోజు అంటే నామ, రూపాలు కల్పింపబడిన రోజు. శ్రీకృష్ణుడు పూర్ణ బ్రహ్మము, కాలాతీతుడు, కాబట్టి పుట్టినరోజు అనే మాట ఆయనకు వర్తించదు. కానీ కృష్ణుడు దేహము ధరించిన రోజు మనకు ఎంతో పవిత్రమైనది. మహాత్ములు పుట్టినరోజులు జరుపుకోవడం ద్వారా, మనస్సు నిర్మలమై వారి వలె జనన-మరణ రహస్యాన్ని తెలుసుకొని, స్వరూప అమృతస్థితిలోకి మేల్కోవాలి, అనెడి తపన కలుగుతుంది. శ్రీకృష్ణుడు స్వయంగా బ్రహ్మము, శ్రీమహావిష్ణువు యొక్క ఉత్కృష్ట అవతారం. పంచభూతాలు, ఈ సృష్టి లేనప్పుడు కూడా ఏ చైతన్యమైతే ఉందో అదే ఉత్కృష్టమైనది. శ్రీకృష్ణుడు పూర్ణ పురుషోత్తముడే కాకుండా, జగద్గురువు కూడా! భగవంతునికి ఎన్ని కళలు ఉన్నాయో అన్ని కళలతోటి జన్మించినవాడు. 'కృష్ణ' శబ్దం చాలా మధురమైనది. అది నర్గుణ, నిత్య ఆనంద తత్త్వం. ఆయన మధురాధిపతి, అంటే హృదయాధిపతి! ఆయనలో ప్రతీది మధురమే! లోకంలో ఉన్నతీపిదనం కొంతకాలానికి వెగటుగా మారుతుంది. నిత్యమధురమైనది బాహ్యంలో ఎక్కడా లేదు, అది కేవలం ఉన్నది హృదయంలోనే! జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత ద్వారా, దివ్యజ్ఞాన బోధను మనకు అందించారు. నారాయణుడు, నరుడికి తత్త్వ విద్యను ఉపదేశించిన గ్రంథరాజం భగవద్గీత. కృష్ణుడు ఒక మాట మాట్లాడినా, ఒక పని చేసిన, అవన్నీ మనకు దేహాత్మ బుద్ధి నుండి విడుదల చెయ్యుటానికి ఉద్దేశించినవే! కాబట్టి పరమాత్మ చెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి. ఆయన ప్రతీ మాట, ప్రతీ చర్య, ప్రతీ కదలిక, ప్రతీ లీల, మానవ జాతికి మహత్తర సందేశమే! అసలు పుట్టుకే లేనివాడు, మనకు పుట్టుక లేకుండా చేసేందుకు, మన కొరకు పుట్టిన వాని వలె కనబడ్డాడు, ఆయనే శ్రీకృష్ణపరమాత్మ!

**(దిII 30-08-2021 శ్రీకృష్ణాష్టమి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# బాధలు లేకపోతే భవిష్యత్తు కూడా ఉండదు

సుందర దృశ్యాలు చూడమని మన కళ్ల ద్వారా మనస్సు అంటుంది. అలాగే ఎంత బాగుందో ఒక్కసారి ముట్టుకో అని చేతులు అంటాయి. ఓ చక్కటి గులాబీని చూడటానికి చేతులు, కళ్లు ఇష్టపడవు. ఇంద్రియాలను గమనించేవాడు చివరకు తాను 'సాక్షి' మాత్రమే అని గ్రహిస్తాడు. తాను కళ్ళు, ముక్కు, చెవి, చేతులు కాదని, తాను దేహం కూడా కాదని తెలుసుకుంటాడు. అప్పుడు మనకు తండ్రి ఎవరు? మన తల్లి మనకు దేహానికే జన్మనిచ్చింది కానీ మనకు కాదు కదా! ఒక స్త్రీ మనకు చచ్చిపోయే శరీరాన్ని ఇచ్చింది. ఆమె ప్రసాదించినది మళ్లీ మరోసారి మరణించే అవకాశాన్ని మాత్రమే, అంటే తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయమని కాదు. ఇది అంతరార్థం కోసం మాత్రమే. ఈ ఎరుక మనకు కలగగానే మనం మన సంసారం నుండి ఇంటి పరిధి నుండి వెలివేయబడతాము. సాక్షీభూతంగా మన సంసార బాధ్యతల నుంచి మనం తప్పించుకోరాదు. సంఘాన్ని, ఇంటిని ద్వేషించమని ఈ మాటలను అర్థం లాగకూడదు. మనం మానసికంగా సన్యసించి జీవితంలో నిజంగా ఉన్నట్లే మనం మంచి నటునిగా బ్రతికే పద్ధతే చాలు అందమైన ఉపాయం. కర్తవ్యాలనన్నిటినీ నెరవేరుస్తూ తామరాకు మీద నీటి బిందువుల్లా ఉండాలి. నిస్సంగత్వం మన మనస్సులో ఏర్పరచుకోవాలి. మనస్సులో ఒంటరితనంతో ఎంతో నిర్మలత్వం ఉంది. ఏకాంతం ఎంతో అందమైనది. సత్‌సంఘం ఉన్నతమైనది. మనం సత్యమార్గంలో ప్రయాణం చెయ్యటానికి మనలో రాగం, మోహం, క్రోధం, లోభిత్వం ఉంది. ఆ అసలు శత్రువులు మనలోనే ఉన్నారు. బయట మనం చూపే సాక్షులు మాత్రమే ఉంటారు. జీసెస్ "భూమి మీదకు శాంతిని నింపటానికి నేను వచ్చానని మానవులు అనుకొంటారు కానీ ఇంట్లో ఇద్దరికి ముగ్గురికి యుద్ధం, తండ్రీ కొడుకు, కోడలు తండ్రితో యుద్ధం. అందరూ ఏకాకులైపోతారు. మీ జన్మకు ముందు కూడా ఎంతో సంక్షోభం జరిగింది" అన్నారు. మనం అంతర్మథనం నుంచే శాంతి లభిస్తుంది. మరో మార్గం లేదు. ఈ బాధలు మనం ఇంతకు ముందు జన్మలో మనం సృష్టించుకొన్నదే అనే వివేకం కలిగి పరిష్కార దిశగా గురువును చేరతాము. వివేకానంద "బాధలు అంటూ ఏమీ లేకుండా హంసతూలికా తల్పంపై కూర్చుని, నౌకర్లతో అంతులేని సంపదలతో, ముద్దొచ్చే బిడ్డలు, భార్యాభర్తలు మీకు సమకూరితే సత్యాన్ని ఎన్నటికీ తెలుసుకోలేరు" అన్నారు. కుంతీదేవి "కృష్ణా మాకు ఎప్పుడూ బాధలనే కలుగజేయి" అని అనక్కరలేదు, వచ్చిన కష్టాలను, బాధలను ఓర్పుతో భరిస్తే చాలు సత్యదర్శనం అవుతుంది. ఈ బాధ ఎందుకు సంక్రమించింది అని మనలో అంతర్యుద్ధం జరగాలి. శాంతి లంభించే వరకూ మనకు విశ్రాంతి పనికిరాదు. శ్రీనాన్నగారు "బాధలు వరాలే" అన్నారు. ఊరించేది పాపం, అతిలోకసుందరి మన కళ్లకు కనబడితే భార్యగా ఉంటే బాగుండును, జగదేక వీరుడు కనబడితే ఇతడు భర్తగా ఉంటే బాగుండును, మనస్సు కలవరపడుతుంది. అన్నీ తోలు బొమ్మలే. మనం సవ్యంగా ఆలోచించాలి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966